మేమే నిర్వహిస్తాం.. మీరు దరఖాస్తు చేయొద్దు

■ తెదేపా వారికీ తప్పని తిప్పలు



ఈనాడు, కర్నూలు : “నియోజకవర్గంలోని మద్యం దుకాణాలు మేమే నిర్వహించుకుంటాం. ఎవరూ దరఖాస్తు చేసేందుకు వీల్లేదు... దరఖాస్తు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని కర్నూలు జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి అనుచరులు హెచ్చరికలు జారీ చేశారు. అబ్కారీ శాఖ అధికారులూ సదరు ప్రజాప్రతినిధి అనుచరులతో కుమ్మక్కై దరఖాస్తులు స్వీకరించడంలేదన్న ఆరోపణలున్నాయి. దరఖాస్తు తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు వెళ్తే “ఎమ్మెల్యే అనుమతి ఉందా ? ఒకసారి వెళ్లి కలవండని’ అధికారులు సూచిస్తుండటం గమనార్హం. సదరు నియోజకవర్గంలోని ఎక్సైజ్ స్టేషన్ల వద్ద ఆ ప్రజాప్రతినిధి అనుచరులు సోమవారం కాపు కాశారు. మద్యం దుకాణాల కోసం పలువురు దరఖాస్తు చేసేందుకు ప్రయత్నించగా కార్యాలయం లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. తెదేపా అనుకూల వ్యాపారులూ ఆ నియోజకవర్గంలో దరఖాస్తు చేయలేకపోయారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అడుగడుగునా బెదిరింపులే

రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల నిర్వహణ బాధ్యతను ప్రైవేటుకు అప్పగిస్తోంది. ఇందులో భాగంగా మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించింది. దరఖాస్తుదారుల సౌకర్యార్థం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సేవలను అందుబాటులో తెచ్చింది. అయినప్పటికీ కొందరు ప్రజాప్రతినిధులు పలువురిని బెదిరిస్తూ దరఖాస్తు చేయనీయకుండా చూస్తున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 99 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా ఆదివారం వరకు 19 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. సోమవారం కొన్ని దరఖాస్తులు వచ్చాయి.

అందరూవాటా ఇవ్వాల్సిందే

● నంద్యాల జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయనప్పటికీ 25 శాతం వాటా ఇవ్వాలని చెబుతున్నారన్న ఆరోపణలున్నాయి. అందుకు ఇష్టమైతేనే దరఖాస్తు చేసుకోవాలంటూ అనధికారిక హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు ప్రచారం ఉంది.

● కర్నూలు జిల్లాకు చెందిన ఓ తెదేపా నేత తన నియోజకవర్గ పరిధిలోని కొన్ని దుకాణాలకు దరఖాస్తులు చేయొద్దని హెచ్చరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఆయా దుకాణాలు తన మనుషులే నిర్వహించుకుంటారని చెబుతుండటంతో వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. ఆయన్ను కాదని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా క్షేత్రస్థాయిలో వ్యాపారం చేసుకునే పరిస్థితి ఉండదని భావిస్తున్నారు.

99 మద్యం దుకాణాలు 797 దరఖాస్తులు

■ రేపటితో ముగియనున్న గడువు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో మద్యం దుకాణాల అనుమతులకు దరఖాస్తుల నమోదు ప్రక్రియ ఊపందుకుంది. సోమవారం సాయంత్రం వరకు 99 దుకాణాలకు ఆఫ్‌లైన్ ద్వారా 797 దరఖాస్తులొచ్చాయి. సోమవారం ఒక్కరోజే 446 వరకు రావడం గమనార్హం. దరఖాస్తుల విషయంలో అధికారులకు ఉన్నతాధికారులు భారీ లక్ష్యం విధించినట్లు తెలిసింది. మూడు కౌంటర్లను సిద్ధం చేయడంతోపాటు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. కర్నూలు స్టేషన్ పరిధిలోని 31 దుకాణాలకు ఆఫ్‌లైన్ ద్వారా 245 దరఖాస్తులు రావటం గమనార్హం.



పట్టలేని దుఃఖం

వీరంత రైల్‌రోకో చేస్తున్నారనుకునేరు.. రైల్వే పనులు చేస్తున్న కూలీలు అంతకన్నా కాదు.. వారంతా విషాదంతో రైల్వే పట్టాలపక్కన కూర్చున్నారు. ఆదోని మండలం గణేకల్లో ఎవరైనా చనిపోతే.. ఇలా రైల్వే గేటు దాటి శ్మశానానికి వెళ్లాలి. గ్రామానికి చెందిన మహేశ్ అనే యువకుడు మృతిచెందారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్థులు ఇలా రైల్వే గేటు దాటుకుంటూ వెళ్లారు. గతంలో అంత్యక్రియలకు పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని మృతి చెందిన ఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని గ్రామీణం


ముడుపులిస్తేనే మ్యుటేషన్లు

“గ్రామస్థాయి రెవెన్యూ అధికారి.. మండలాన్ని శాసిస్తున్నారు.. డబ్బిస్తే చాలు ఏ పనైనా చిటికెలో చేసేస్తారు.. ఎలాంటి విచారణ చేయకుండానే పనులు చక్కబెడతారు. దస్త్రాలు మార్చేస్తారు.. ఉన్నవి లేన్నట్లు.. ఉన్నవి లేనట్లు మాయ చేస్తారు. ఇటీవల సాధారణ బదిలీల ప్రక్రియ జరిగింది. సదరు అధికారి ఐదేళ్ల కాలపరిమితి పూర్తైనా కదిలించలేదు. డబ్బులిచ్చే పనులు చేస్తుండటం.. ఇతర కార్యకలాపాలు చక్కదిద్దుతుండటంతో రెవెన్యూ అధికారులు అండగా ఉంటున్నారు.. గతంలో పని చేసిన తహసీల్దార్ అండతో గత నాలుగేళ్లుగా రెచ్చిపోయారు.. ముడుపులు తీసుకొని మ్యుటేషన్లు చేసి.. రూ. కోట్లు వెనకేసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

–కర్నూలు అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో తిష్ఠవేసిన సదరు అవినీతి అధికారి అక్రమాల బాగోతం ఇది!!



■ కీలక పాత్ర పోషిస్తున్న ఓ వీఆర్వో





నిషేధిత జాబితాలో పెట్టినా

మామిదాలపాడులో సర్వే నంబరు-165-2ఎలో 3.31 ఎకరాల వక్ఫ్ భూమిని 04-03-2021లో ఏపీ స్టేట్ వక్ఫ్‌బోర్డు నిషేధిత జాబితాలో పెట్టింది. ఆ సర్వే నంబరు ప్రస్తుతం అదృశ్యమైంది. దాన్ని మూడు సబ్ డివిజన్లు(165-2ఎ, 165-2ఎ2, 165-2ఎ2)గా చేశారు. ఆ సర్వే నంబరులో 6.71 ఎకరాలు ఉన్నట్లు వెబ్‌ల్యాండ్‌లో కనిపిస్తోంది. నిషేధిత జాబితాలో ఉన్న భూములను మ్యుటేషన్ చేయకూడదన్న సీసీఎల్ఏ నిబంధనలను బేఖాతరు చేసి స్థిరాస్తి వ్యాపారులకు కట్టబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

నాడు రెండు.. నేడు ఐదు సబ్ డివిజన్లు

మామిదాలపాడులో సర్వే నంబరు-165లో మొత్తం 24.85 ఎకరాలు ఉండగా.. 2022, 2023 సంవత్సరానికి ముందు వరకు 1165-2 బిలో 2.05 ఎకరాల రోడ్డు, 165-2సిలో 0.10 ఎకరాలే వెబ్‌ల్యాండ్ అడంగల్‌లో నమోదైంది. కొన్ని నెలల కిందట 165-1ఎ, 165-1బి 165-2ఎ, 165-2ఎ1, 265-2ఎ2 ఐదు సబ్ డివిజన్లుగా మార్చారు. ఆర్ఎస్ఆర్ ప్రకారం 22.70 ఎకరాలు ఉండాల్సి ఉండగా.. 22.76 ఎకరాలు.. అంటే మరో 6 సెంట్లు అదనంగా నమోదు చేశారు. ఇక్కడ ఎకరా రూ.కోటికిపైగా ఉండటంతో ఈ ఐదింటికి కలిసి రూ.25 లక్షలు తీసుకొని మ్యుటేషన్‌లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

గుప్పిట్లో తహసీల్దారు డిజిటల్ కీ

కర్నూలు నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల విలువ భారీగా పెరిగింది. ఎకరా రూ.కోటికిపైగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో తహసీల్దారు డిజిటల్ కీని తన వద్ద పెట్టుకొని చక్రం తిప్పుతున్నారు. భూయజమానులు తమ భూమిని ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేయించుకోవాలంటే బేరం కుదరాల్సిందే. మ్యుటేషన్లంటే ఆయనకు పంట పండినట్లే.. మార్కెట్ విలువకు తగ్గట్టు.. రూ.లక్షలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముడుపులిస్తే చాలు.. రోజుల వ్యవధిలోనే పనులు చేసిపెడతారు. సదరు వీఆర్వోకు కేటాయించిన గ్రామంలో స్థానికంగా ఉండరు.. ఆయన పనులను మరో సచివాలయ ఉద్యోగి చేసి పెట్టాలి.. ఆయన మాత్రం కర్నూలు నగరంలో ఉంటూ డబ్బులు వచ్చే పనులు చేస్తుంటారు..

పరిధిదాటి పనులు

ఏ గ్రామంలోనైనా.. పట్టణ పరిధిలో ఏ కాలనీలోనైనా.. ఎలాంటి పనులైనా ముడుపులు తీసుకొని చేస్తుంటారు. ఆయా ప్రాంతాలు.. ఇతర వీఆర్వోల పరిధిలో ఉన్నప్పటికీ ఈయనే పెత్తనం చేస్తున్నారు. జొహరాపురంలో ఇళ్ల పట్టాల మార్పిడికి రూ.20 వేలు, రూ.30 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి జొహరాపురం ఆయన పరిధిలోకి రాదు. గతంలో పనిచేసిన తహసీల్దారు అండదండలతో ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఉన్నతాధికారులు ఎన్నికల విధులు వేసినా తప్పించారంటే మండల స్థాయి అధికారుల సహకారం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఓ తహసీల్దారు అండదండలు సమృద్ధిగా ఉన్నాయి.. ఇక తనను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో వ్యవహరిస్తున్నారు.

పత్రానికో లెక్క

నగరంలోని ఎర్రబురుజులో ఓ వ్యక్తి వాస్తవ ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆ పరిధిలోని రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి నివేదికలిచ్చారు. పూర్వ తహసీల్దారు పత్రం జారీ చేయలేదు. సదరు వీఆర్వో రూ.40 వేలు ముడుపులు తీసుకొని పత్రం ఇప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

టెట్‌కు 281 మంది గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 281 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ఇన్‌ఛార్జి డీఈవో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సెషన్‌లో 1,619 మందికి గాను 1,471 మంది, మధ్యాహ్న సెషన్‌లో 1,623 మందికి గాను 1,490 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు

ఇన్‌ఛార్జి డీఈవోగా శ్రీనివాసులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ 14వ తేదీ వరకు వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో పరిపాలన సాఫీగా సాగేందుకు వీలుగా ఏడీ-2 వి.శ్రీనివాసులుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. డీఈవో వచ్చేవరకు వి.శ్రీనివాసులు ఇన్‌ఛార్జి డీఈవోగా వ్యవహరిస్తారు.



పూత రాలొద్దు.. కాయ కందిపోవద్దు
తెగుళ్ల కలవరింత
కాసుల క్యాబేజీ 6



వీరభద్ర నృత్య విన్యాసం

శేష వాహనంపై ఆదిదంపతులు

శ్రీశైల క్షేత్రంలో దసరా మహోత్సవాల సందడి మిన్నంటుతోంది. ఐదోరోజైన సోమవారం భ్రమరాంబాదేవి స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శేషవాహనంపై ఆదిదంపతులు ఆశీనులయ్యారు. తర్వాత ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తీసుకొచ్చారు. ఊరేగింపులో ఎదుట కళాకారులు ప్రదర్శించిన కేరళ, కన్నడ సంప్రదాయ నృత్యాలు, మహిళల కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే :



కొలువుదీరిన స్వామి, అమ్మవారు


శిరస్సున తలపాగలు ధరించి కోలాటంతో అలరిస్తున్న మహిళలు, యువతులు

వాగులో అడ్డుకట్టలు

■ బఫర్‌జోన్‌లో నిర్మాణాలు
■ గుర్తించినా చర్యలు శూన్యం

ఈనాడు, కర్నూలు

కర్నూలు నగర శివారులోని పి.రుద్రవరం గ్రామ పరిధిలో సర్వే నంబర్లు 215, 702/3, 214, 216లో ఓ నిర్మాణ సంస్థ పెద్దఎత్తున భూ ఆక్రమణలకు పాల్పడింది. ‘కడగమ్మ’ వాగులోకి నీటి ప్రవాహం నియంత్రించేలా నిర్మాణాలు చేపట్టింది. నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు.. రూ.50 కోట్ల విలువైన బఫర్‌జోన్ భూములను ఆక్రమించారు.. విలాసవంతమైన భవంతులు నిర్మించి అమ్మకానికి పెట్టారు. నిజమని నిర్ధారణ అయినా చర్యలు తీసుకోవడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. సదరు నిర్మాణ సంస్థకు గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన వైకాపా పెద్దల అండదండలు సమృద్ధిగా ఉండటం వల్లే చర్యలకు వెనుకాడుతున్నారని తెలుస్తోంది. ఆరెకరాల వరకు ఆక్రమణలకు గురై ఉంటుందని రైతులు ఆరోపిస్తున్నారు.



గడువు ముగిసినా తొలగించని తాత్కాలిక కాజ్‌వే

పరిశీలించి వదిలేశారు

ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆక్రమణలు గుర్తించేందుకు వివిధ శాఖల ఉన్నతాధికారులు గత నెల 3వ తేదీన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా పంచాయతీ అధికారి, జలవనరుల శాఖ ఎస్ఈ, డీఈఈ, ఏఈలు, కర్నూలు ఆర్డీవో, కర్నూలు గ్రామీణ తహసీల్దారు, మండల సర్వేయర్, ఎంపీడీవోలు నిర్మాణ ప్రాంతాన్ని నిశితంగా తనిఖీ చేశారు. నిర్మాణ సంస్థ ప్రతినిధులు, రైతులను పిలిపించి మాట్లాడారు. నిర్మాణ సంస్థ పాల్పడిన ఉల్లంఘనలను పలువురు రైతులు అధికారులకు ప్రత్యక్షంగా చూపారు. “ తాత్కాలిక అనుమతులు తీసుకుని కాజ్‌వే నిర్మించారు.. గడువు ముగిసినా తొలగించడం లేదు.. కాజ్‌వే నిర్మాణంతో పొలాలను వరదలు ముంచెత్తుతున్నాయని” రైతులు వాపోయారు. శ్మశానం మధ్యలో అడ్డగోలుగా కచ్చా రోడ్డును వేశారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కుడా ఏం చేస్తున్నట్లు

జల వనరుల సమీపంలో వేసే లేఅవుట్లకు ‘కుడా’ అనుమతులు రావాలంటే జలవనరుల శాఖ నిరభ్యంతర పత్రం ఇవ్వాలి. సదరు వెంచర్‌కు తాము ఎన్‌వోసీ ఇవ్వలేదని జలవనరుల శాఖ అధికారులు తేల్చి చెబుతున్నారు. ‘కడగమ్మ వాగు’కు అనుకునే నిర్మాణ సంస్థ ప్రహరీ స్పష్టంగా కనిపిస్తోంది. ఆ ప్రాంతం వాగు బఫర్‌జోన్ పరిధిలోనే ఉంటుందని రైతులు చెబుతున్నా కుడా అధికారులు పట్టించుకోవడం లేదు. సదరు సంస్థ భారీగా ముడుపులు ముట్టజెప్పడం వల్లే అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఆదేశాలు బేఖాతరు

కాజ్‌వేను వెంటనే తొలగించాలి.. వరద వస్తే పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.. తాత్కాలిక కాజ్‌వే నిర్మాణానికి గతంలో ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తున్నాం.. తక్షణమే తొలగించకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ అధికారులు నిర్మాణ సంస్థకు లిఖితపూర్వకంగా ఆదేశాలిచ్చారు. ఉత్తర్వులు ఇచ్చి నెల రోజులు గడిచినా సదరు నిర్మాణ సంస్థ నుంచి స్పందనలేదు. అయినా అధికారులు అలసత్వంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంస్థకు ఏమాత్రం సంబంధం లేని భూముల్లో పెద్దపెద్ద రేకులు ఏర్పాటుచేసి వాటిపై ప్రచార హోర్డింగులు ఏర్పాటుచేసినా వాటినీ తొలగించలేదు.

అడుగు వేయలేను ఆసరా ఇవ్వండి



ఈ చిత్రంలోని బాలిక పేరు శ్రావణి.. వీరిది ఎమ్మిగనూరు మండలం పరమాన్‌దొడ్డి. బాలిక మానసిక దివ్యాంగురాలు. నడవలేని స్థితిలో ఉండటంతో తల్లి పనులన్నీ మానుకుని ఇంటి వద్దే చూసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అధిక పింఛను ఇప్పించాలని తల్లిదండ్రులు జయమ్మ, లక్ష్మన్నలు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు విన్నవించారు. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు పత్తికొండ నియోజకవర్గ పర్యటనకు వచ్చినప్పుడు సమస్యను విన్నవించినట్లు పేర్కొన్నారు.

- ఈనాడు, కర్నూలు

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

■ ఓర్వకల్లు నోడ్‌తో ప్రగతి పరుగులు
■ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా వేదికపై మంత్రి టి.జి.భరత్ తదితరులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఐదేళ్ల అభివృద్ధి లక్ష్యాలతో స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంటు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర 2047 జిల్లా దార్శనిక ప్రణాళిక (2024-29) రూపకల్పనపై ప్రజాప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఓర్వకల్లు పారిశ్రామికవాడతో జిల్లాలో గణనీయమైన అభివృద్ధి సాధించవచ్చని చెప్పారు. 2,500 కోట్లతో ఓర్వకల్లు నోడ్ అభివృద్ధి జరగనుందని పేర్కొన్నారు. చిన్న, మధ్య, పెద్దతరహా లక్ష్యాలతో ప్రణాళికలు రూపొందించుకుని అమలుచేయనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఏడాదికి 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా ఐదేళ్లకుగాను స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో అభివృద్ధిపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లోనూ గణనీయమైన ప్రగతి సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసి దానిని అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు తమతమ నియోజకవర్గాల పరిధిలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వర రెడ్డి, బాలనాగిరెడ్డి, గౌరు చరితారెడ్డి, డా.పార్థసారథి వాల్మీకి, విరూపాక్షి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పింఛనుదారుల ఆత్మగౌరవాన్ని సీఎం కాపాడారు

■ ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మెజారిటీ ఉద్యోగులు కోరుకున్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని ఏపీఆర్‌ఎస్‌ఏ, ఏపీ ఐకాస అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పుల కోసం చేయి చాచాల్సి వచ్చేదని.. నేడు నిత్యం ఒకటో తేదీన జీతం/పింఛను చెల్లిస్తూ గతంలో కోల్పోయిన గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాపాడారని చెప్పారు. ఆయన సోమవారం కర్నూలులో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు, పింఛనుదారులకు రూ.22 వేల కోట్లకు పైగా బకాయిలు ఇవ్వాల్సి ఉందని ముఖ్యమంత్రి అసెంబ్లీ సమావేశాల్లో వెల్లడించారన్నారు.



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

రూ.130 కోట్లు విరాళంగా ఇచ్చాం

విజయవాడతోపాటు పలు జిల్లాలో వరదల కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకుగాను ఉద్యోగులు రూ.130 కోట్లను ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చినట్లు బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. గత నెలలోనే రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మంది ఉద్యోగ విరమణ చేశారని.. 2022 నుంచి ఇప్పటివరకు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యంగా చెల్లించాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను తక్షణమే వర్తింజేయాలని కోరారు.

ఎన్టీఆర్ గృహాలు ఎలా ఉన్నాయి

■ ఐదేళ్లూ చిల్లిగవ్వ ఇవ్వని వైకాపా ■ క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్న అధికారులు



ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద చేపట్టిన ఇల్లు

డోన్, న్యూస్‌టుడే: బిల్లుల కోసం ఐదేళ్లుగా నిరీక్షిస్తున్న ఎన్టీఆర్ గృహ నిర్మాణదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకానికి పునాది వేశారు. పలువురు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకొన్నారు.. అంతలోనే వైకాపా అధికారంలోకి వచ్చింది.. ఐదేళ్లుగా చిల్లిగవ్వ ఇవ్వలేదు.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్టీఆర్ గృహాల పరిస్థితిపై సర్వే చేయాలని అధికారులను ఆదేశించింది. పథకం కింద ఎంత మంది ఇళ్లు నిర్మించుకొన్నారు.. అవి ఏ దశలో ఉన్నాయో ఆరా తీస్తున్నారు.

- నంద్యాల జిల్లాలో 27191 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. ఇందులో ఎన్ఎస్ (మొదలు కానివి) 4164, బీబీఎల్‌లో 1582, బీఎల్‌లో 3241, ఎల్ఎల్‌లో 39, ఆర్ఎల్‌లో 1079, ఆర్‌సీలో 9403 ఉండగా, 7683 ఇళ్లు పూర్తయ్యాయి.
- కర్నూలు జిల్లాలో 24628 ఇళ్లు ఉండగా, ఇందులో ఎన్ఎస్‌లో 4692, బీబీఎల్‌లో 1070, బీఎల్‌లో 3385, ఎల్ఎల్‌లో 35, ఆర్ఎల్ 1487, ఆర్‌సీ 8906, పూర్తయినవి 4999గా తేల్చారు.
- ఇళ్ల ప్రస్తుత పరిస్థితిని యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఎవరెవరికి ఎంతమేర బిల్లులు వచ్చాయి, ఎంతమేర రావాలి తదితర వివరాలన్నీ నమోదు చేస్తున్నారు.

పూత రాలొద్దు.. కాయ కందిపోవద్దు



ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో కంది సాధారణ సాగు విస్తీర్ణం 64 వేల ఎకరాలు.. ఈ ఏడాది 1.60 లక్షల ఎకరాల్లో సాగైంది.. ప్రస్తుతం పంట పూతదశలో ఉంది.. ఈ దశలో తగిన చర్యలు తీసుకోవాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి సూచించారు. ఈ దశలో లేత పిందెలు, కాయల్లో పూత పురుగు, గూడు పురుగు గూడు చేసుకుంటాయి. కాయ అడుగు భాగాన రంధ్రం చేసి లోపలి గింజలను తినేసి డొల్ల చేస్తాయి. వీటి నివారణకు తొలిదశలో లీటరు నీటిలో పదివేల పీపీఎం వేపనూనెను 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉద్ధృతిని బట్టి క్లోరిపైరిపాస్ 20 శాతం ఈసీ 2.5 మి.లీ., లేదా ఇమామెక్టిన్ బెంజయేట్ 0.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా క్లోరాంట్రినిప్రోల్ 0.3 మి.లీ. గానీ లీటరు నీటిలో కలిపి మార్చి మార్చి పిచికారీ చేయాలి.

కాయ ఈగ: పిల్ల పురుగులు కాయలో ఉండి గింజలను తినేస్తాయి. చివరకు తల్లి పురుగు బయటకు వస్తుంది. లేత పిందె దశలో గుడ్లు పెడుతుంది. వెంటనే గమనించి పది వేల పీపీఎం వేప గింజల కషాయం 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గింజ గట్టి పడే దశలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ప్రొఫెనోపాస్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

శనగ పచ్చ : పూల మొగ్గలు, పూతను, కాయ లోపల గింజలను తిని నష్టపరుస్తుంది. పురుగు ఉద్ధృతిని గమనించి ఎకరాకు ఆరు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పూత మొగ్గ దశలో పది వేల పీపీఎం వేప నూనె కషాయాన్ని 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతిని బట్టి క్లోరాంట్రినిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజయేట్ 0.2 గ్రా. లీటరు నీటిలో కలిపి వేయాలి.

కాసుల క్యాబేజీ



బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురానికి చెందిన ఇమాం కాశీం 1.30 ఎకరాల్లో క్యాబేజీ సాగు చేసి లాభాలు పొందుతున్నారు. ఒక్కోటి రూ.450 చొప్పున 14 ప్యాకెట్లు తీసుకొచ్చారు. నర్సరీలో 30 నుంచి 40 రోజుల వరకు నారు పెంచారు. తర్వాత ఎకరాకు 25 వేల మొక్కల చొప్పున 37 వేల వరకు నాటారు. 85-90 రోజుల్లో కోతకొచ్చింది. మొక్కలు నాటేందుకు 10 మంది కూలీలు అవసరం. మొక్క నాటేకంటే ముందు భూమిని బాగా కలియదున్ని సాళ్లలో గడ్డి మందు పిచికారీ చేయాలి. మొక్కలు నాటిన వారం రోజుల నుంచి పురుగు మందు వాడాలి. విత్తనాల కొనుగోలుకు రూ.7,200, భూమి దున్నేందుకు రూ.3 వేలు, నీళ్ల మందుకు రూ.12 వేలు, భూమిలో వేసే మందుకు రూ.12 వేలు, కలుపు తీసేందుకు కూలీలకు రూ.20 వేలు ఖర్చు చేశారు. మొత్తం 60 క్వింటాళ్ల (150 ప్యాకెట్లు) దిగుబడి వచ్చిందన్నారు. అన్ని ఖర్చులు రూ.54 వేలు పోనూ సుమారు రూ.85 వేల నుంచి రూ.90 వేలు వచ్చిందన్నారు.

- న్యూస్‌టుడే, బేతంచెర్ల

రైతేరాజు



తెగుళ్ల కలవరింత

☛ జాగ్రత్తలు తీసుకుంటేనే అధిక దిగుబడులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: వర్షాలు సమృద్ధిగా కురిసాయి.. కాల్వలు నిండుగా ప్రవహిస్తున్నాయి.. రెండేళ్ల తర్వాత వరి సాగు విస్తరించింది.. ప్రస్తుతం పంట 60 రోజులకు చేరింది.. ప్రస్తుత దశలో తెగుళ్లు వచ్చే అవకాశం ఎక్కువ.. రైతులు అప్రమత్తంగా ఉంటేనే పంట దిగుబడి పెరుగుతుందని బనగానపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం. బాలరాజు సూచించారు.

■ **అగ్గితెగులు:** ముందు జాగ్రత్తగా సుపోమోనాస్‌ను లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలి. ఇప్పటికే సోకి ఉంటే ట్రైసైక్లోజోల్ పొడి మందును 1 లీటరు నీటికి 0.6 గ్రాములు లేదా హెక్సాకొనజోల్ 1 లీటరు నీటికి 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. లేదా వెలిడా మైథిన్‌ను లీటరు నీటిలో 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

■ **కాండం పురుగు:** ఈ తెగులు సోకితే ఎకరాకు 8 కిలోల కార్బోఫ్యూరాన్ 4జీ గుళికలు చల్లాలి.

■ **సుడిదోమ:** ఈ తెగులు సోకితే లీటరు నీటిలో డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రాముల పొడిని గానీ లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రాముల్ని గానీ లేదా పానికామ్ డస్ 0.4 గ్రాముల్ని గానీ కలిపి పిచికారీ చేయాలి.

■ డ్రోన్‌తో పిచికారీ చేసే రైతులు ఆయా మందులను 80 శాతం మాత్రమే వినియోగించాలి, ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలి.

వ్యాధి ముదిరితే జీవం పోతుంది



వర్షాకాలం ముగిసింది.. చల్లని గాలుల తీవ్రత క్రమంగా పెరుగుతోంది.. ఈ నేపథ్యంలో అక్టోబరు, నవంబరు మాసాల్లో జీవాలకు పలు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.. యజమానులు నివారణ చర్యలు చేపడితే ఆరోగ్యంగా ఉంటాయని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం పశువిజ్ఞాన శాస్త్రవేత్త నిరంజన్‌రెడ్డి సూచించారు. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

■ **పీపీఆర్:** ఈ వ్యాధి సోకిన గొర్రెలకు జ్వర తీవ్రత పెరుగుతుంది. గ్రాసం తినవు. నీరసం వేస్తుంది. నోట్లో కురుపులు ఏర్పడి నోటి నుంచి దుర్వాసన వస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాలు వ్యాధి తీవ్రతనుబట్టి వారం రోజుల వ్యవధిలో చనిపోతాయి.

■ **చికిత్స:** ఈ వ్యాధికి సరైన చికిత్స లేదు. లక్షణాలు గమనించిన వెంటనే పశువైద్యున్ని సంప్రదించి మెలకువలు పాటిస్తే 50 శాతం వరకు జీవాలను కాపాడుకోవచ్చు. ఉప్పు, గ్లూకోజ్ కలిపిన గంజిని తాగిస్తే త్వరగా కోలుకుంటాయి. పొటాషియం పర్మాంగనేట్ 1 శాతం ద్రావణంతో నోట్లోని కురుపులను కడగాలి.

■ **నీలి నాలుక:** ఈ వ్యాధి వైరస్ వల్ల సోకుతుంది. దోమకాటుతో ఈ క్రిములు గొర్రెల శరీరంలోకి ప్రవేశించడంతో ప్రబలుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే గొర్రెల్లో నాలుక నీలిరంగుగా మారుతుంది. జ్వరమున్న గొర్రెల చిగుళ్లు, పెదవులు వాచి లోపలి భాగం ఎర్రగా మారి చిన్నగుల్లలు ఏర్పడుతాయి. నోటి నుంచి సురగ, చొంగ కారుతుంది. గిట్టల మధ్య ఎర్రగా ఉంటుంది. వ్యాధి తీవ్రతనుబట్టి 5-6 రోజుల్లో మేత మేయక, నీరు తాగక చనిపోతాయి.

■ **చికిత్స:** నోట్లోని పుండ్లను 1 శాతం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి బోరిక్ పౌడర్ రుద్దాలి. గిట్టల మధ్యనున్న పుండ్లను కడిగి హిమాక్స్, నీమెంట్ వంటి ఆయింట్‌మెంట్లు పూయాలి. ఈ వ్యాధికి నిరోధక టీకాలు లేవు.

కదల్లేరు.. కదిలిస్తే కన్నీరు

☛ ఓ వృద్ధుడి ఆవేదన



నడవలేకపోవడంతో నరసింహులును కుర్చీలో ఎత్తుకొస్తున్న కుటుంబ సభ్యులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించారు. రెక్కలు ముక్కలు చేసుకొని ఐదుగురు కొడుకులను పెంచి పెద్దచేశారు. కుటుంబ బాగోగులు చూసుకున్నారు. ఉన్నంతలో అందరినీ బాగానే చూసుకున్నారు. ఆనందంగా ఉన్న ఆ ఇంట విషాదం పొడచూపింది. కుమారుడు దూరమై తల్లిదండ్రులు విలవిల్లాడారు. తోడబుట్టిన వారూ ఆవేదన చెందారు. కొద్ది రోజులకు ఇంటి యజమానినే కష్టం పలకరించింది. ఇంటిల్లిపాదినీ కలవరపెడుతోంది. కదల్లేని స్థితిలో ఉన్న 59 ఏళ్ల నరసింహులు దీనగాథ ఇది.

మూడేళ్లుగా నరకమే..

ఆదోని డివిజన్‌లోని కోసిగి మండలం ఐరన్‌గల్ గ్రామానికి చెందిన నరసింహులు భార్య మారెమ్మ, ఐదుగురు కుమారులతో కలిసి జీవిస్తున్నారు. ఉన్నంతలో ఆనందంగా గడిపేవారు. ఉన్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ.. కుటుంబాన్ని పోషించే వారు. కుమారుల్లో ఒకరు చనిపోవడంతో కుంగిపోయారు. మూడేళ్ల కిందట నరసింహులు పక్షవాతం బారిన పడ్డారు. రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. చేతులూ పనిచేయడం లేదు. అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి. కుమారులు, భార్య ఎవరో ఒకరు సాయంగా ఉండక తప్పడం లేదు. ఇందుకు సంబంధించి వివిధ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. రూ.లక్షలు ఖర్చు చేశారు. ఆపరేషన్ చేయించినా.. నయం కాలేదు. కుర్చీకి పరిమితమయ్యారు. మూడేళ్లుగా ఇబ్బందులకు గురవుతున్నారు. పింఛను అందడం లేదు. మాటలు సైతం తడబడుతూ మాట్లాడుతున్నారు. తన సమస్య వివరించేందుకు సోమవారం భార్య, కుమారుడి సాయంతో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. వైకాపా పాలనలో పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరిగిన మంజూరు చేయలేదు. తన గోడు వినిపించుకోవాలని కోరుతున్నారు నరసింహులు.

పింఛను ఇప్పించండి

- నరసింహులు, ఐరన్‌గల్



పింఛను కోసం మూడేళ్లుగా తిరుగుతున్నాం. ఇంత వరకు మంజూరు చేయలేదు. కాళ్లు, చేతులు పనిచేయడం లేదు. మా పరిస్థితి దయనీయంగా ఉంది. సదరం శిబిరంలో 40 శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించారు. అది కూడా తాత్కాలికం అని జారీ చేశారు. ధ్రువపత్రం పూర్తిస్థాయిలో లేకపోవడంతో పింఛను రాదని చెబుతున్నారు. ఎక్కడికి వెళ్లాలన్నా.. ఇద్దరు మనుషులు ఉండాలి. ఈ రోజు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి కుటుంబ సభ్యులతో వచ్చా. పింఛను మంజూరు చేసి, న్యాయం చేయాలి.

మోసపోయాం.. ఆదుకోండి

- ఎస్పీకి బాధితుల వినతి



బాధితుడి సమస్య వింటున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మాయమాటలతో పలువురు వ్యక్తులు తమను మోసగించి డబ్బులు తీసుకున్నారని.. వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు విన్నవించారు. కర్నూలు కొత్తపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. మొత్తం 132 మంది తమ సమస్యలు విన్నవించి వినతిపత్రాలు అందజేశారు. విచారణ జరిపించి చట్టపరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. శిక్షణ ఐపీఎస్ చల్లా కల్యాణి, న్యాయ సలహాదారు మల్లికార్జునరావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

■ తమ స్థలాల ఆక్రమణలపై కర్నూలు సీసీఎస్‌లో 2019లో కేసు నమోదైందని, ఇంతవరకు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయలేదని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కర్నూలు పరిధిలోని రాంప్రియానగర్ స్థల బాధితులు విన్నవించారు.

■ బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన షేక్ సాదిక్, షేక్ తస్లీమా, గుంటూరుకు చెందిన రవిలు ఐదుగురి నుంచి రూ.30 లక్షలు తీసుకుని మోసగించారని బంగారుపేటకు చెందిన మురళీమోహన్ ఫిర్యాదు చేశారు.

■ పెద్దల నుంచి వచ్చిన స్థలాన్ని తన వదిన, రత్నస్వామి అనేవారు మూడు సెంట్లు ఆక్రమించుకున్నారని.. న్యాయం చేయాలని కర్నూలు మండలం గార్గేయపురానికి చెందిన దేవదానం పేర్కొన్నారు.

■ కర్నూలు బాలాజీనగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ ప్రైవేటుగా చిట్టీలు వేసి 50 మంది నుంచి రూ.10 కోట్లు తీసుకుని ఇవ్వటంలేదని, న్యాయం చేయాలని కర్నూలుకు చెందిన అశోక్, సునీల్, సురేష్ విన్నవించారు.

■ గ్రూప్-4 ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ముగ్గురి నుంచి రూ.20 లక్షల తీసుకుని మోసగించారని ఎమ్మిగనూరు, నందవరానికి చెందిన రాజు, వెంకప్ప, మురళీ ఫిర్యాదు చేశారు.

■ మసాలా వ్యాపారం చేసే తనకు కంభం ప్రాంతానికి చెందిన మనోహర్ రూ.25 లక్షల సరకు తీసుకుని డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని కర్నూలుకు చెందిన వెంకన్న పేర్కొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జాతీయ ఉపకార వేతనానికి సంబంధించి దరఖాస్తు సమయం పొడిగించినట్లు ఇన్‌ఛార్జి డీఈవో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య బడుల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

బీఈడీ సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి ఫలితాలు విడుదల చేసినట్లు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 2,706 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 2,357 మంది పాసైనట్లు చెప్పారు. ఫలితాల కోసం ఆర్‌యూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని చెప్పారు.


రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి మార్పు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిని మార్చనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన సోమవారం కర్నూలులో మాట్లాడారు. ఈనెల 13న ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేసి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు ఆయన తెలిపారు.

తుప్పు వదిలించేదెన్నడో



నగరంలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పలు వాహనాలు ముళ్లపొదల్లో ఉన్నాయి. చిన్నపాటి మరమ్మతులకు గురవడంతో వీటిని వృథాగా పడేశారు. ఏళ్ల తరబడి అలానే ఉండటంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనికితోడు ఈ ప్రాంతంలో ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోవడంతో పాములు సంచరిస్తున్నాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. - ఈనాడు, కర్నూలు



జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో శిథిలావస్థలో వాహనాలు

వైద్య, ఆరోగ్య శాఖ శిక్షణ విభాగం వెనుక ముళ్లపొదల్లో అంబులెన్సులు, ఇతర వాహనాలు

ఆకాశ వంతెన.. చింత తీరేనా



ఆదోని పట్టణంలోని మేదరగేరి వద్ద ఉన్న ఆకాశ వంతెన రహదారి గుంతలమయంగా మారింది. గత నెలలో వినాయక నిమజ్జనం పురస్కరించుకొని వినాయక విగ్రహాల ఊరేగింపు ఉండడంతో.. కంకరవేసి తాత్కాలికంగా మూసివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కంకర మొత్తం చెదిరిపోయి మళ్లీ గుంతలమయంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో ఇనుప కడ్డీలు బయటకు తేలాయి. వంతెన మధ్యభాగంలో పెద్ద గుంత ఏర్పడింది. రాత్రివేళ వాహన చోదకులకు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి వంతెనపై ఉన్న గుంతలు మూసివేయించి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు

నిరుపేదలం.. ఆదుకోండి



కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన మహబూబ్ బాషా కుమారుడు కె.అక్బర్ బాషా వికలాంగుడు. రెండు కాళ్లు, రెండు చేతులు పనిచేయవు. చివరికి అతను మంచానికే పరిమితమయ్యాడు. తాము నిరుపేదలమని.. తన కుమారుడికి పింఛను, వీల్‌ఛైర్ ఇప్పించాలని తండ్రి మహబూబ్ బాషా కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం తన కుమారుడిని మూడు చక్రాల బండిలో కలెక్టరేట్‌కు తీసుకొచ్చి విన్నవించారు. కలెక్టర్ రంజిత్ బాషా వేదిక పైనుంచి దిగి అక్బర్ బాషా వద్దకొచ్చి అతని తల్లిదండ్రులతో మాట్లాడారు. సమస్య పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

- న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను సత్వరమే, నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సోమవారం వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. వినతులు మళ్లీమళ్లీ రీఓపెన్ చేయకుండా ఒకేసారి పరిష్కరించాలని చెప్పారు. కర్నూలు అర్బన్, ఆదోని గ్రామీణ, దేవనకొండ, గోనెగండ్ల, కల్లూరు మండలాల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఆయా మండలాల తహసీల్దార్లు ఫిర్యాదుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ డా.బి.నవ్య, డీఆర్వో చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంజినీర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల పనులు ఉపాధి నిధులతో చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. పనులు నాణ్యతగా చేయించి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు గుర్తింపు తెచ్చేలా ప్రతి ఇంజినీరు కృషి చేయాలని పీఆర్ ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంగీతరావు అన్నారు. ఆయన సోమవారం నగరంలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఇంజినీర్లతో సమావేశమయ్యారు. ఇంజినీర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పీఆర్ ఇంజినీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమాలనైనా ఇంజినీర్లు తమ వంతు బాధ్యతగా విధులు నిర్వహిస్తారని, పూర్తైన పనులకు బిల్లులు సకాలంలో వచ్చేలా రాష్ట్ర అసోసియేషన్ ద్వారా ప్రభుత్వానికి సమాచారం అందించాలని కోరారు. అనంతరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మురళీకృష్ణనాయుడు, కార్యదర్శి సుధాకరరెడ్డిని సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సతీష్‌కుమార్, ప్రతినిధులు మన్మథరావు, నాగిరెడ్డి, రమేష్‌కుమార్ రెడ్డి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలోకి ఇద్దరు వైకాపా కార్పొరేటర్లు




తెదేపాలో చేరిన కార్పొరేటర్లతో మంత్రి టీజీ భరత్


కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక పరిధిలో 9, 12 వార్డులకు చెందిన వైకాపా కార్పొరేటర్లు మంత్రి టీజీ భరత్ సమక్షంలో సోమవారం తెదేపాలో చేరారు. 9, 12 వార్డు కార్పొరేటర్లు పుల్లమ్మ, అన్నెపోగు క్రాంతికుమార్‌లు పార్టీలో చేరగా మంత్రి వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెదేపాతోనే అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో పలువురు కార్పొరేటర్లు వైకాపాను వీడి తెదేపాలోకి వస్తున్నారని చెప్పారు. తనకు పేరు వస్తుందన్న ఉద్దేశంతోనే వైకాపా నేతలు కర్నూలు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పార్టీలో చేరిన కార్పొరేటర్లు మాట్లాడుతూ మంత్రి టీజీతోనే వార్డుల్లో అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకే వైకాపాను వీడి తెదేపాలో చేరుతున్నట్లు తెలిపారు.

పత్తి లోడు వాహనం బోల్తా

☛ ఇద్దరు హమాలీల దుర్మరణం

కర్నూలు గ్రామీణ, నేరవిభాగం న్యూస్‌టుడే : కర్నూలు గ్రామీణ మండలం ఆర్.కొంతలపాడు వాగు వద్ద సోమవారం పత్తి లోడు వాహనం బోల్తాపడిన ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం తిమ్మాజీపల్లె గ్రామానికి చెందిన జ్ఞానవంతుడు (28), జమ్మన్న (40)తోపాటు మరో నలుగురు పత్తి వ్యాపారుల వద్ద హమాలీలుగా పనిచేస్తున్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు పరిధిలో బొలెరో వాహనంలో పత్తి లోడు చేసుకుని శాంతినగర్‌కు బయలుదేరారు. కర్నూలు గ్రామీణ మండలం ఆర్.కొంతలపాడు వాగులో నుంచి వాహనం పైకి ఎక్కే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంపైన కూర్చోవడంతో వాహనం మీదపడి జ్ఞానవంతుడు, జమ్మన్న అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీకాంత్, పరశురాముడు, సురేష్, నర్సింహులు గాయపడగా వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. జ్ఞానవంతుడికి మూడేళ్ల కిందట వివాహమైంది. జమ్మన్నకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కర్నూలు తాలుకా అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





జమ్మన్న, జ్ఞానవంతుడు (పాత చిత్రాలు)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన జయప్రకాష్ (22) అనే యువకుడు సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని గురురాజు, రాజేశ్వరి దంపతుల పెద్ద కుమారుడు జయప్రకాశ్ బీటెక్ పూర్తిచేసి ప్రైవేటు ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లారు. తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కంటైనర్ వాహనం ఢీకొనడంతో మృతిచెందారు. ఇంటికి ఆసరాగా నిలుస్తాడనుకున్న కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు నరసింహారెడ్డి నగర్‌లో భూగర్భ గనుల శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి (40) మృతి చెందారు. అతను రోడ్లపై ప్లాస్టిక్ సీసాలు ఏరుకుంటూ వెళ్తుండగా కారు అతి వేగంతో ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందారు. కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరాల ద్వారా పోలీసులు కారును గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదోని
•ఆదోని •ఆలూరు •పత్తికొండ

ఆలూరు ఏజీపీగా సిద్ధప్ప



ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు ఏజీపీ రాష్ట్ర ప్రభుత్వం కుంబూరు సిద్ధప్పను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రభుత్వ తరఫున కేసులను చూస్తారని, ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ఆదోని పురపాలక, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం లోని 39వ వార్డులో పురపాలక సంఘం కమిషనరు కృష్ణ సోమవారం పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యల గురించి తెలుసుకున్నారు. మురుగుకాలువలు సమస్యలతో పాటు సామూహిక శౌచాలయాలు నిర్మించాలని ప్రజలు కోరారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్, ప్రజారోగ్య విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తివిద్య కోర్సులతో స్వయం ఉపాధి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వృత్తివిద్య కోర్సులు చేయడం వల్ల విద్యార్థులు స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవచ్చని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న అన్నారు. వృత్తివిద్యా కోర్సు చేస్తున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యుత్తు పరికరాలు, ఇతర రిపేర్ దుకాణాలను సందర్శించి వాటి పనితీరును తెలుసుకున్నారు. కంప్యూటర్ కుమారుకర్, విక్రమ్, వృత్తి విద్య శిక్షకులు సౌజన్య, రాజమ్మ పాల్గొన్నారు.

హొళగుంద, న్యూస్‌టుడే: **సమస్య:** హొళగుంద నేతాజీ పాఠశాలకు వెళ్లే మార్గంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లతో పరిసరాలంతా అపరిశుభ్రంగా మారాయి. శుభ్రం చేయించండి. – మల్లి, హొళగుంద
సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. – రంగమ్మ, సర్పంచి, హొళగుంద

తొగర్చేడు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: **సమస్య:** తొగర్చేడు గ్రామంలోని పాఠశాల సమీపంలో మురుగు కాల్వలు సక్రమంగా లేవు. మురుగు ముందుకు పారడం లేదు. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే మరింత అధ్వానంగా ఉంటుంది, కాల్వలు నిర్మించాలి. – గోపి, తొగర్చేడు
సమాధానం: ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తా. – రేణుకమ్మ, సర్పంచి

సమస్య: ఆలూరు కోయనగర్ కాలనీలోని నవోదయం ఎదురు వీధిలో వారం రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో చిన్నారులు, వృద్ధులు బయట తిరగాలంటే భయపడుతున్నారు. స్తంభానికి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకోవాలి. – అంజి, ఆలూరు
సమాధానం: వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి, ఆలూరు

పల్లె కబుర్లు

పెరవలి(మద్దికెర), న్యూస్‌టుడే: పెరవలిలో మురుగు కాల్వల నిర్మాణానికి ఉపాధి నిధులతో పనులు చేపట్టాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తమచౌదరి తెలిపారు. మురుగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉన్న ప్రాంతాల్లో ఈ పనులు చేస్తున్నామన్నారు.

జొన్నగిరి(తుగ్గలి), న్యూస్‌టుడే: పగిడిరాయి, జొన్నగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శులు రాజు నాయక్, నారాయణస్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. వీరు ఉపాధి ఏపీవో హేమ సుందర్ ఇన్‌ఛార్జి ఎంపీపీ ఎర్రనాగప్ప, మాజీ ఎంపీపీ గురుస్వామి, జొన్నగిరి సర్పంచి ఓబులేశ్, తెదేపా నాయకులు బాలన్న తదితరులను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చెన్నంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కార్తీక్, పెండేకల్లుకు గోపాల్, మారెల్లకు రామాంజనేయులు బాధ్యతలు చేపట్టారు.

ఎల్లార్తి(ఆదోని నేరవార్తలు), న్యూస్‌టుడే: ఎల్లార్తి గ్రామానికి చెందిన మల్లికార్జున సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యం కారణంగానే ఆ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

కప్పట్రాళ్ల(దేవనకొండ) న్యూస్‌టుడే: ఇంట్లో నిద్రిస్తున్న మహిళ పాముకాటుకు గురై మృతిచెందిన ఘటన కప్పట్రాళ్లలో జరిగింది. గ్రామానికి చెందిన పద్మావతి(33) గుడిసెలో నిద్రిస్తుండగా వేకువజామున చేతికి పాము కరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు కోడుమూరుకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించగా, కోలుకోలేక మృతిచెందినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు.

నీటి కుంటలో పడి రైతు మృతి

దేవనకొండ, న్యూస్‌టుడే: పొలం వద్ద రైతు నీటి కుంటలో పడి మృతిచెందిన ఘటన దేవనకొండ మండలం కుంకనూరులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కుంకనూరు గ్రామానికి చెందిన దంపతులు ఉమ, ఆనంద్(35) సోమవారం పొలం పనులు వెళ్లారు. తీరు తెచ్చేందుకు ఆనంద్ నీటి కుంట వద్దకు వెళ్లారు. భర్త ఎంతకీ రాకపోవడంతో భార్య ఉమ నీటి కుంట దగ్గరకు వెళ్లి చూశారు. భర్త అపస్మారకస్థితిలో పడుండటంతో కేకలు వేశారు. చుట్టు పక్కల వారు వచ్చి ఆనందన్ను పత్తికొండ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.



ఆనంద్ (పాతచిత్రం)

ఇస్వీ గ్రామంలో ఇరువర్గాల ఘర్షణ

ఆదోని నేరవార్తలు, గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం ఇస్వీ గ్రామంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు జరిగింది. ఓ వర్గానికి చెందిన హుసేనీ, దేవేంద్ర, మరో వర్గానికి చెందిన పవన్‌కుమార్, రూతమ్మ, మల్లి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఇస్వీ ఎస్సై నాగేంద్ర, సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: కోయనగర్‌కు చెందిన తిప్పేమ్మను ఏడాది కిందట జూటూరు బంగ్లా గ్రామానికి చెందిన మధు జయమారుతీకి ఇచ్చి వివాహం చేశారు. వివాహం అయినప్పటి నుంచి భర్త, అత్త మామ తనను వేధిస్తున్నారని తల్లితండ్రులకు తెలిపింది.. పలుమార్లు ఆదుకునే నచ్చజెప్పారు. కాని అదే పునరావృతం కావడంతో దిమ్మిని చెంది సోమవారం తల్లిదండ్రులతో కలిసి బాధితురాలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ జయన్న తెలిపారు.

అంగన్‌వాడీ భవనాలకు అవినీతి బీటలు

✦ నాణ్యత వెక్కిరింత ✦ నెర్రలిచ్చిన గోడలు.. చెదిరిన బండలు

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం. ఇందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అవస్థల మయంగా మారింది. భవిష్యత్తు తరాల కోసం నిర్మించిన భవనాలు అధ్వానంగా మారాయి. గోడ లకిచ్చిన అవినీతి పగుళ్లు వెక్కిరిస్తున్నాయి. చెదిరిన బండలు భయపెడుతున్నాయి. అసౌకర్యాలు, అపాయాల నడుమ ఆటపాటలు సాగించాల్సిన పరిస్థితి. ఫ్లోరింగ్ బండలు చెదిరిపోయాయి. బాలల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల్లోని పలు భవనాలు నెర్రలిచ్చాయి. నాణ్యత లోపాలకు సాక్ష్యాలుగా నిలిచాయి.



ఐసీడీఎస్ కార్యాలయంలో దెబ్బతిన్న ఫ్లోరింగ్

మండలం	
అంగన్‌వాడీ కేంద్రాలు	
చిన్నారుల సంఖ్య	
సొంత భవనాలు	
అద్దె భవనాలు	
గర్భిణులు	
బాలింతలు	

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గంలో మొత్తం 224 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 65 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా.. మరో 20 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో తాత్కాలికంగా సాగుతున్నాయి. మిగతా 139 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అసౌకర్యాల మధ్య అంగన్‌వాడీలు కొనసాగుతున్నాయి. కనీస వసతులు లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు. వైకాపా పాలనలో వీటిపై దృష్టిసారించకపోవడంతో చాలా కేంద్రాలు అద్దె భవనాలకే పరిమితం అయ్యాయి. కొన్ని నూతన కేంద్రాలు ఏర్పాటు చేసినా.. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. గుడ్లు, పౌష్టికాహారం పంపిణీలో లోపాలు ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆదోని పట్టణం	
అంగన్‌వాడీ కేంద్రాలు	126
చిన్నారుల సంఖ్య	10710
గర్భిణులు	1443
బాలింతలు	1189

ఆదోని మండలం సాదాపురం పంచాయతీ పరిధిలో రూ.29 లక్షలతో నిర్మించిన ఆదోని ఐసీడీఎస్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. పగుళ్లు ఏర్పడ్డాయి. 2020 డిసెంబర్ 28వ తేదీన పనులు పూర్తిచేసి ప్రారంభించారు. నిర్మాణం పూర్తి చేసిన నాలుగేళ్లకే పగుళ్లు ఏర్పడి బీటలు వచ్చాయి. ఫ్లోరింగ్ దెబ్బతింది. కార్యాలయంలో కిటికీలు ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాల్సి ఉంది.

ఆదోని	
అంగన్‌వాడీ కేంద్రాలు	98
చిన్నారుల సంఖ్య	9177
అద్దె భవనాలు	139
సొంత భవనాలు	65 (నియోజకవర్గంలో)
గర్భిణులు	1259
బాలింతలు	1065



నిర్వహణ అగమ్యగోచరం

పత్తికొండ, మద్దికెర, తుగ్గలి	
అంగన్‌వాడీ కేంద్రాలు	181
చిన్నారుల సంఖ్య	11,900
సొంత భవనాలు	55
అద్దె భవనాలు	100

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె గదుల్లోనే కేంద్రాల నిర్వహణ సాగిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో భయంభయంగా చిన్నారులు కాలం వెళ్లదీస్తున్నారు. పత్తికొండ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో నాడు-నేడు పనులు కింద ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలాయి. తుగ్గలి మండలంలోని కడమకుంట్ల, లింగనేనిదొడ్డి, రాతన, మద్దికెర మండలంలోని మద్దికెర, బురుజుల, పత్తికొండ మండలంలోని పత్తికొండ, నలకదొడ్డి గ్రామాల్లో నిర్మాణాలు ఎన్నటికీ పూర్తవుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని నలకదొడ్డిలో ఓ అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం పూర్తయి మూడేళ్లు అవుతున్నా.. అది ప్రారంభానికి నోచుకోవడంలేదు. మిగతా నిర్మాణాలు నిధుల సమస్యతో అసంపూర్తిగా నిలిచిపోయాయి.



నలకదొడ్డిలో ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ కేంద్రం

అనతి కాలంలోనే.. శిథిలమవుతున్నాయి

మద్దికెర	
అంగన్‌వాడీ కేంద్రాలు	39
చిన్నారుల సంఖ్య	2,149
సొంత భవనాలు	14
అద్దె భవనాలు	14
గర్భిణులు	269 మంది
బాలింతలు	214 మంది

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని 1వ, 11వ అంగన్‌వాడీ కేంద్రాలను ఒకే చోట నిర్వహిస్తున్నారు. ఇక్కడ 29 మంది పిల్లలున్నారు. స్థానిక పంచాయతీ కుంటలో ఈ భవనాన్ని గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. కుంట, చెరువుల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలున్నా.. అప్పటి అధికారులు, గుత్తేదారులు నిబంధనలకు నీళ్లొదిలారు. దీనికి తోడు నిర్మాణంలో నాణ్యత గాలికొదిలారు. దీంతో పునాదుల్లో బీటలుబారి పగుళ్లు ఏర్పడ్డాయి. పిల్లలు, వారి తల్లుల రాకపోకల కోసం మెట్లపై నిర్మించిన ర్యాంప్ గోడ సైతం కూలింది. భవన నిర్మాణంలో నాణ్యత లోపం వల్ల శిథిలావస్థకు చేరిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మద్దికెరలో ఒకటో అంగన్‌వాడీ భవనం దుస్థితి

బన్ని ఉత్సవాలకు శ్రీకారం

హొళగుంద, హొళగుంద, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రత్యేకత ఉన్న దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవాలు సోమవారం కంకణధారణతో ప్రారంభమయ్యాయి. హొళగుంద మండలంలోని నెరణికిలో కొలువైన స్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపు మధ్య దేవరగట్టుకు తెచ్చారు. అక్కడ అదే గ్రామానికి చెందిన పురోహితులు గణపతి పూజ, కంకణధారణ, నిశ్చితార్థం, ధ్వజారోహణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం బన్ని ఉత్సవాలు ముగిసే వరకు కొలువై ఉండే కల్యాణ కట్ట (సింహాసన కట్ట) వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి పల్లకిని దేవరగట్టుకు తీసుకొచ్చారు. కార్యక్రమంలో నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామస్థులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ ఆధ్వర్యంలో హొళగుంద ఎస్సై బాల నరసింహులు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



దేవరగట్టుకు చేరుకుంటున్న ఉత్సవమూర్తులు

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

దేవనకొండ, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆలూరు తెదేపా బాధ్యుడు వీరభద్రగౌడ్ అన్నారు. దేవనకొండ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రైతులకు శనగ విత్తనాలను, టార్పాలిన్ పట్టలను సోమవారం రాయితీపై పంపిణీ చేశారు. క్వింటాలు శనగ పప్పు విత్తనాలను రాయితీ ద్వారా రూ.7,050 అందజేస్తుందన్నారు. మండలానికి 520 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏ విజయ్ మోహన్, జనసేన శ్వేతిత్ర రామచేంద్ర, ఏవో సురేశ్‌బాబు, మండల కన్వీనర్ విజయ్, ఏఈవోలు రంగన్న, జయరాం, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ నాయకులు వీరభద్రగౌడ్

నకిలీ విత్తనాలతో నట్టేట ముంచారు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: నకిలీ విత్తనాలు అంటగట్టి తమను నట్టేట ముంచారని ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామ రైతులు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయామని చెబుతున్నా.. వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. రైతు సంఘ మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు నిరసనలో పాల్గొన్నారు. సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు వెంకన్న, మల్లికార్జున, సాగునీటి సాధన సమితి నాయకులు ఆదినారాయణ, కేవీపీఎస్ నాయకులు తిక్కప్ప తదితరులు మద్దతు పలికారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు, నాయకులు

వేడుకలు భక్తితో నిర్వహిద్దాం

అరికెర(ఆలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: దేవరగట్టులో దసరా పండగ రోజు జరిగే బన్ని ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుందామని, వివాదాలకు, ఘర్షణలకు దూరంగా ఉండాలని ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్సై వెంకటనరసింహులు అన్నారు. మండలంలోని అరికెర, అరికెర తండాలో పోలీసులు సోమవారం సోదాలు చేపట్టారు. ఆయా రింగుకర్రలు, ఎలాంటి ధ్రువపత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో హొళగుంద, చిప్పగిరి, హలహర్వి ఎస్సైలు బాల నరసింహులు, రమేష్‌బాబు, చంద్రతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అరికెరలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్రలు, ద్విచక్రవాహనాలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 44 పెట్రోలింగ్ వాహనంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న రాము రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆదారం కోల్పోయిన ఆతని కుటుంబానికి ఎన్‌హెచ్44 నిర్వాహకులు రూ.6లక్షల ఆర్థిక సాయం మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును మండల తెదేపా నాయకులు శివశంకరరెడ్డి చేతుల మీదుగా రాము కుటుంబ సభ్యులకు అందించారు.



చెక్కు అందజేస్తున్న తెదేపా నాయకులు శివశంకరరెడ్డి

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యతి నరసింగానంద్ సరస్వతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ముస్లింలు ఆదోని పట్టణంలో సోమవారం పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. ఆదోని యూత్ కరెక్ట్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక జామియా మసీదు నుంచి ముస్లింలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ధర్నా చేపట్టారు. అనంతరం ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు.



ఆదోనిలో నిరసన ర్యాలీ చేపట్టిన ముస్లింలు

వాటర్‌షెడ్‌తో అన్నదాతలకు ప్రయోజనం

హలహర్వి, న్యూస్‌టుడే: వాటర్‌షెడ్ ప్రాజెక్టుతో అన్నదాతలకు అధిక ప్రయోజనం కలుగుతుందని ప్రాజెక్టు పీవో వలీపీర్ అన్నారు. బాపురం గ్రామంలో సోమవారం నూతన కమిటీని ఎంపిక చేశారు. ఛైర్మన్‌గా ముత్తురామ్, వైస్ ఛైర్మన్‌గా లక్ష్మీతో పాటు మరో 11 మంది సభ్యులతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ అజీజ్, తెదేపా నాయకులు ప్రహ్లాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో అధికారులు

కార్యాలయంలో పాముల భయం

ఉప్పర్లపల్లి(తుగ్గలి), న్యూస్‌టుడే: గ్రామ శివారులోని ఉప్పర్లపల్లి రైతు సేవా కేంద్రంలో పాముల బెడదతో వ్యవసాయ సిబ్బంది, రైతులు బెంబేలెత్తిపోతున్నారు. వారంలో రెండు పాములు కనిపించడంతో వాటిని గ్రామస్థులు చంపేశారు. అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సిబ్బంది కోరుతున్నారు.


అబ్కారీ కార్యాలయం తనిఖీ

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను నేరుగా ఆన్‌లైన్ గాని, సంబంధిత అబ్కారీ కార్యాలయంలో గాని చేసుకోవచ్చని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఈఎస్ రాజశేఖరగౌడ్ అన్నారు. ఆలూరులోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. సీఐ లలితాదేవి, ఎస్సై నవీన్‌కుమార్‌తో పలు అంశాలపై చర్చించారు.

ఉల్లికుళ్లి ఏడుస్తున్నారు

పెట్టుబడి నీటిపాలు ■ రైతుల ఆవేదన

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు కష్టమంతా నీటి పాలైంది. దిగుబడి అంతా వర్షం నీటిలో తడవడంతో కోస్తేగాని మస్సేరవుతున్నారు. జీవనం కరిసిన వర్షాలు రైతును ఒక్కసారి బిక్కిరి చేశాయి. పొలంలో ఉల్లి పంట కోసింది. ఉల్లి పంట కోతకోసి బయటపడాలని అనుకునే లోపే వరుసగా మూడు రోజులు వర్షాలు వెంటాడాయి. దీంతో ఉల్లి గడ్డలు తడిసి, బురదమయంగా మారి కుళ్లుతున్నాయి. రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



నారాయణపురం గ్రామంలో తడిసిన ఉల్లిని ఆరబెట్టిన రైతులు

రూన్న ఒకటిన్నర ఎకరా పొలంలో ఉల్లి సాగు చేశారు. ఎరువులు చేసి, సుమారు రూ.1.50లక్షల పెట్టుబడి పెట్టారు. మూడు నెలల పాటు పంటను కంటికి రెప్పలా కాపాడారు. పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో వచ్చాయి. మూడు రోజుల కిందట ఉల్లిని తొలగించారు. అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఉల్లిగడ్డలు తడిసిపోయాయి. కూలీల చేత ఆరబెట్టించి గ్రేడింగ్ చేయిస్తున్నారు. ఏమాత్రం తడిసినట్లు ఉన్నా.. మార్కెట్లో వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. నష్టాలు వస్తున్నా రైతులు వాపోతున్నారు. పలు గ్రామాల్లోని చాలా మంది రైతులది ఇదే పరిస్థితి.

చేతికందే సమయంలో..

ఆదోని డివిజన్‌లోని ఆదోని, కౌతాళం, హొళగుంద మండలాల్లో 1500 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. చేతికందే సమయంలోనే వర్షం నిలువునా ముంచింది. ఆదోని మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మల్లికా

ధరలు పడిపోతున్నాయ్: – మల్లికార్జున, రైతు, నారాయణపురం

ఉల్లి పంట కన్నెర చేస్తోంది. మూడు రోజులుగా వర్షం కురుస్తుండటంతో దిగుబడులు తడిసిపోయాయి. పంటను ఆరబెట్టుకుని గ్రేడింగ్ చేస్తున్నాం. కుళ్లిన ఉల్లి గడ్డలను ఏరివేస్తున్నాం. వర్షాల, తాడేపల్లి గూడెం, కర్నూలు మార్కెట్లో ఉల్లికి ధరలు పడిపోతున్నాయి. తడిసినవి తీసుకెళ్తే ఎవరూ కొనుగోలు చేయరు. ఒకటిన్నర ఎకరానికి 70 క్వింటాళ్ల దిగుబడులు వస్తుందని అంచనా వేసుకున్నా, వర్షానికి తడవడంతో ఉల్లిగడ్డలు కుళ్లుతున్నాయి. రైతులను ఆదుకోవాలి.



ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి సబ్ కలెక్టర్ వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నూర్జహాన్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ వద్దుల, గృహనిర్మాణ శాఖ ఈఈ రవికుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వేణు సూర్య, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు విన్నవిస్తున్న అర్జీదారులు

అక్షరాలు దిద్దిన బడి.. ఆనందాల సందడి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఉత్సాహంగా సాగింది. 1994-95వ బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఒకచోట చేరారు. నాటి మధుర జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విజయకుమారి, పరమేశ్, మోహన్‌రావు, సిద్ధప్ప, నాగరాజారావును పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షబ్బీర్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

శిక్షణ డీఎస్పీగా ఉషశ్రీ

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ శిక్షణ డీఎస్పీగా ఉషశ్రీ సోమవారం విధుల్లో చేరారు. గ్రూప్-1 ద్వారా ఎంపికైన ఏపీపీఎస్‌సీ-2022 బ్యాచ్‌కు చెందిన ఆమె కొంత కాలం ఇక్కడ పనిచేయనున్నట్లు తెలిపారు.

ఆనందంగా జీవించాలి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తిలో నాలుగు రోజుల పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో హ్యాపినెస్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ శిక్షకులు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉంటుందన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని మున్సిపల్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్వీపర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. స్వీపర్లు ఆదోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ, స్కూల్ స్వీపర్ల యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆజయ్‌బాబు మాట్లాడారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతి పత్రం అందించారు.

ఏడుగురిపై కేసు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన ఈరన్నపై దాడి చేసిన కేసులో మంగన్న, మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్సై నాగేంద్ర తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని డివిజన్ పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన ఓ దళిత మహిళపై దాడిచేసి, అవమానించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ భరద్వాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు, వివిధ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు ప్రసాద్, వెంకప్ప, గంగన్న, మల్లికార్జున, మహిళా సంఘం నాయకురాలు సుజాతమ్మ, ఉషారాణి, విజయలక్ష్మి, ఆదా కన్వీనర్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

భక్తులతో రద్దీగా మారిన ఉరుకుంద క్షేత్రం

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం) న్యూస్‌టుడే : కర్నూలు జిల్లాలో ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద శ్రీ నరసింహ ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ఉదయాన్నే ప్రత్యేక పూజలు, అభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

తగ్గిన వేరుశనగ ధర

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : వ్యవసాయ మార్కెట్లో సోమవారం వేరుశనగ ధర క్వింటాకు రూ.500 తగ్గింది. ఆదివారం క్వింటా గరిష్ఠ ధర రూ.7,020లు పలుకగా సోమవారం క్వింటా గరిష్ఠ ధర రూ.6,470కు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌కు 1328 వేరుశనగ బస్తాలను రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. గరిష్ఠ ధర రూ.6,470 మధ్యస్థ ధర రూ.5,170, కనిష్ఠ ధర రూ.2,689 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

కోసిగి : సమస్య : మండల కేంద్రంలో స్థానిక రైల్వేగేట్ దగ్గర నుంచి మద్యం దుకాణం వరకు రోడ్డుకు గుంతలు పడ్డాయి. **- స్థానికుడు లక్ష్మన్న**

సమాధానం : రోడ్డుపై పడిన గుంతలను పూడ్చుతాము. **- నరేష్, రోడ్లు భవనాల ఏఈ, ఎమ్మిగనూరు**

నందవరం: సమస్య : మండల పరిధిలోని మిట్టాసోమాపురం గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయాలి. **- నరసింహులు గ్రామస్థుడు**

సమాధానం : కాలువలను శుభ్రం చేయిస్తాం. **- ఎంపీడీవో పుల్లయ్య నందవరం మండలం**

పెద్దకడబూరు,: సమస్య : ముచ్చిగేరి గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **-గ్రామస్థులు ముచ్చిగేరి**

సమాధానం : పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపడతాము. **- జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో పెద్దకడబూరు**

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : గురుకుల పాఠశాల, కళాశాలలో పని చేస్తున్న ఒప్పంద ఉపాధ్యాయ, అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ హమీద్ కోరారు. సోమవారం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కర్నూల్‌లో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హమీద్ మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ ప్రకటనతో నియామకం జరిగిన, గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం కారణంగా నేటికి ఒప్పంద ఉద్యోగులుగా కొనసాగుతున్నామని వాపోయారు. ప్రత్యేక అంశంగా పరిగణించి న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.


మంత్రి బీసీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు అమీద్

వైకాపా స్వార్థం..
వ్యాపారులకు శాపం


శ్రీనివాస కూడలిలో కోసిగి రహదారిలో చిరు వ్యాపారుల దుకాణాల తొలగింపు

ఎమ్మిగనూరు న్యూస్‌టుడే: పురపాలికలో ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు ఆదాయం సముపార్జన పేరిట దుకాణాల నిర్మాణాలు చేపట్టి వైకాపా దందాలు సాగించింది. ఆ దుకాణాలను దక్కించుకోవాలంటే మున్సిపాలిటీతో పాటుగా తమకు కొంత మేర కప్పం కట్టాల్సిందేనంటూ నాటి వైకాపా నాయకులు హుకుం జారీ చేశారు. పట్టణంలోని ఖాళీ స్థలాల్లో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న డబ్బాలను బలవంతంగా తొలగించారు. దీంతో చిరు వ్యాపారస్తులందరూ రోడ్డుకు ఇరువైపులా వ్యాపారం నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చిరు వ్యాపారులను బలవంతంగా నెట్టేశారు

ఎమ్మిగనూరు పట్టణంలో శ్రీనివాస కూడలి నుంచి మార్కెట్‌యార్డుకు వెళ్లే దారిలో దాదాపు 40 సంవత్సరాలుగా 25 మంది వ్యాపారస్తులు వడ్రంగి పని, టైలరింగ్, మేదరవృత్తి, పండ్ల వ్యాపారం, ఇతర చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఏటా మున్సిపాలిటికి పన్నుల రూపంలో రూ.2500 చెల్లిస్తున్నారు. ఈ చిరువ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్న స్థలం ఆసుపత్రికి సమీపంలోనే ఉండటంతో దీనిపై వైకాపా నాయకుల కన్ను పడింది. షాపింగ్ దుకాణాల నిర్మాణాల పేరిట మున్సిపల్ అధికారులు చేత 2023లో బలవంతంగా గుడిసెలు, అంగళ్లు, బొంగుల, వడ్రంగుల దుకాణాలను బలవంతంగా తొలగింపజేయించారు.

ప్రతిపాదనలు పెట్టి వదిలేశారు

పట్టణంలో శ్రీనివాస కూడలి నుంచి మార్కెట్ యార్డుకు వెళ్లే దారిలోని మున్సిపల్ స్థలాలలో నిర్మాణాలను చేపట్టేందుకు అప్పట్లో మున్సిపల్ అజెండాలో ఉంచారు. నిధులను సమకూర్చుకోవడానికి కౌన్సిల్ ఆమోదించిన ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. పనులు మొదలు పెట్టకపోవడం గురించి సంబంధిత అధికారులను అడిగితే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించి దుకాణాలను నిర్మించి చిరువ్యాపారులకు కేటాయించాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.


కోసిగి రహదారిలో మార్కెట్ కమిటీ నిర్మించిన దుకాణాలు

సొమ్ము చేసుకున్నారు

వ్యవసాయ మార్కెట్‌యార్డులో గతంలో ఎలాంటి దుకాణాలు లేవు. 2022లో వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆదాయ వనరుల పేరిట దుకాణాలకు శ్రీకారం చుట్టారు. కోసిగి రోడ్డుకు 8 దుకాణాలు, జాతీయ రహదారిలో (మంత్రాలయం రహదారిలో) 8 దుకాణాలను నిర్మించారు. వీటిలో ఎక్కువ మొత్తంలో వైకాపా నాయకుల అనుచరులే దక్కించుకున్నారు. వైకాపా నాయకులు గుడ్‌విల్, ప్రజాప్రతినిధి మామూళ్ల కింద దాదాపు రూ.అరకోటిపైగానే వసూళ్లు చేసినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఒక్కొక్క దుకాణానికి గుడ్‌విల్ కాక వ్యాపారస్తుని నుంచి రూ.4 నుంచి రూ.7లక్షల వరకు వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాణ్యమైన నెయ్యితోనే పరిమళ ప్రసాదం

మంత్రాలయం, న్యూస్‌టుడే : నాణ్యమైన నెయ్యితోనే, నాణ్యత పరీక్షలు అనంతరమే పవిత్రమైన పరిమళ ప్రసాదం తయారు చేసి భక్తులకు పంపిణీ చేస్తామని మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు పేర్కొన్నారు. సోమవారం పీఠాధిపతి పాత్రికేయులతో మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వస్తున్న భక్తులకు వసతి, తాగునీరు, అన్నప్రసాదం సేవలందిస్తున్నామన్నారు. రాఘవేంద్రస్వామి స్వయంగా రచించిన శ్రీమన్‌న్యాయసుధా పరిమళ గ్రంథం పేరుతోనే భక్తులకు పరిమళ ప్రసాదం శతాబ్దాలుగా అందజేయడం జరుగుతుందన్నారు. శుద్ధమైన ఆవు నెయ్యితో ప్రసాదం తయారు చేసిన ప్రసాదం భక్తులకు అందిస్తున్నామన్నారు. మూడు రోజుల ధార్మిక పర్యటన నిమిత్తం పీఠాధిపతి మైసూరు నగరానికి బయలుదేరి వెళ్లినట్లు మఠం అధికారులు తెలిపారు.


పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

సుపరిపాలన అందించడమే లక్ష్యం

గోనెగండ్ల న్యూస్‌టుడే : ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం రైతులకు రాయితీ శనగ విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో


రాయితీ విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలు అధికారులు చుట్టూ తిరగకుండా ప్రజాదర్బార్‌లోనే అన్ని శాఖలకు చెందిన వినతులు స్వీకరించి, వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. రైతులను అన్ని విధాలుగా చేయూత అందించేందుకు ప్రభుత్వం రాయితీ విత్తనాలు బిందు సేద్యం పరికరాలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. తహసీల్దారు కుమార్‌స్వామి, ఎంపీడీవో మణిమంజరి, ఏడీఏ ఎస్.మహమ్మద్ ఖాద్రీ తెదేపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : పట్టణంలో చేనేత కార్మికుడు మోనే హరికృష్ణ అనారోగ్యానికి గురి కావడంతో వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 3.50 లక్షలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే బీవీ తెలిపారు.

తెదేపా నాయకుని మృతికి నివాళులు

సి.బెళగల్ న్యూస్‌టుడే : మండలంలోని ముడుమాల గ్రామంలో మరణించిన తెదేపా సీనియరు నాయకుడు యన్.రాధాక్రిష్ణరెడ్డి భౌతిక కాయానికి సోమవారం తెదేపా సీనియరు నాయకుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, అలంపూరు మాజీ


నివాళులర్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి

ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాశ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఈర్లదిన్నె వెంకట్రామిరెడ్డి, బి.చంద్రశేఖరు, కర్నూలు మాజీ జడ్పీటీసీ సభ్యుడు రేమట సుదర్శన్ రెడ్డి, కార్యకర్తలు నివాళులర్పించారు.

రాయితీపై శనగవిత్తనాలు పంపిణీ

సి.బెళగల్ న్యూస్‌టుడే : మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఏఓ మల్లెష్‌కుమార్ తెదేపా నాయకులు తిమ్మప్ప, ధనుంజయ ఆధ్వర్యంలో రాయితీపై రైతులకు శనగవిత్తనాలు పంపిణీ చేశారు. శనగ విత్తనం క్వింటా ధర రూ.9400 కాగా అందులో 25శాతం రాయితీగా ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరు : పట్టణంలోని హెచ్‌బీఎస్‌కాలనీలో గాయత్రీదేవి దేవాలయంలో పూజలు


ఎమ్మిగనూరు వ్యవసాయం : వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అర్ధనారీశ్వరుడు అలంకరణలో అమ్మవారు


కోడుమూరు గ్రామీణం : ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో శ్రీరామాలయంలో సామూహిక కుంకమార్చన

మహా చండి అమ్మవారు


గూడూరులోని వీరభద్ర స్వామి ఆలయంలో


మంత్రాలయం గ్రామీణం (కౌతాళం) : ఉప్పరహాల్ : మహచండి అలంకరణలో గ్రామదేవత


మంత్రాలయం : వాసవీ కల్యాణ మంటపంలో లలితా మహా చండీదేవి అవతారంలో అమ్మవారు

వంతెన లేక రాకపోకలకు కష్టాలు



గూడూరు మండలంలోని పెంచికలపాడు గుడిపాడు గ్రామాల మధ్యలోని వక్కెర వాగుపై వంతెన నిర్మించాలని ఇరు గ్రామాల ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు. వర్షం కురిసిందంటే రహదారిపై నీళ్లు ఉద్ధృతంగా ప్రవహించడంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్ పాఠశాల వాగు అవతల ఉండటంతో వరద నీళ్లు ప్రవహిస్తున్నప్పుడు పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే గూడూరు గ్రామీణం**

చెక్‌డ్యామ్‌ను కూలగొట్టి..



బనవాసి ఫారంలోని అటవీ భూములలో నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసిన చెక్‌డ్యామ్‌ను కూలగొట్టి కొత్త చెక్‌డ్యామ్ కోసం సిద్ధం చేస్తున్నారు. 2017లోనే రూ.5లక్షలతో చెక్‌డ్యామ్‌ని నిర్మించారు. మరో లక్ష రుపాయలు వెచ్చించి డ్రాగ్ అవుట్ గుంతను తవ్వారు. దానిని కూల్చి ఇప్పుడు మరో రూ.5లక్షలు వెచ్చించి చిన్నపాటి చెరువు మాదిరిగా ఏర్పాటు చేస్తున్నారు. మంచిగానే ఉన్నా చెక్‌డ్యాంను పడగొట్టడం ఏమిటని రైతులు విమర్శిస్తున్నారు. రైతులు సిబ్బందిని ఆరాతీస్తే నీరు లీకేజీ అవుతుందని సమాధానమిస్తున్నారు. **- ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే**

ఒకే యాప్ కొనసాగించాలని వినతి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : అంగన్వాడీ కేంద్రాలలో ఒకే యాప్ కొనసాగించాలని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్లు అసోసియేషన్ అధ్యక్షురాలు గోవర్ధనమ్మ కోరారు. సోమవారం సీడీపీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. గోవర్ధనమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భవతులు, బాలింతలు, పిల్లలకు ఒకే యాప్ ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అనుగుణంగా అంగన్వాడీ టీచర్ల, వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగలక్ష్మి, సీఐటీయూ రాముడు, నాగలక్ష్మి, జయంతి, శైలజా, మేరీ తదితరులు పాల్గొన్నారు.


సీడీపీవోకు వినతి పత్రాన్ని అందజేసిన అంగన్‌వాడీ వర్కర్లు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

నందవరం న్యూస్‌టుడే : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామం తుంగభద్ర నదిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టడంలో రెవెన్యూ, పోలీసు శాఖ పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగలదిన్నె గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రోజుకు 100ట్రిప్పుల ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం తాలూకా కార్యదర్శి శాంతన్న, సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, మునిస్వామి, లింగన్న, దేవరాజు, తిమ్మప్ప పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

సి.బెళగల్ న్యూస్‌టుడే : మండల కేంద్రలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయం క్రీడా మైదానంలో రెండురోజులుగా జరుగుతున్న ఏడవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ గిడ్డయ్య, సి.బెళగల్ మాజీ జెడ్పీటీసీ



విజేతలకు బహుమతిని అందజేస్తున్న జడ్పీటీసి మాజీ సభ్యుడు బి.చంద్రశేఖర్ తదితరులు

సభ్యుడు బి.చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి.బెళగల్ గురుకుల విద్యాలయంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. బాలుర విభాగంలో విజేతలుగా అన్నమయ్య, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాలు వరుసగా నిలిచాయి. బాలికల విభాగంలో వరుసగా నెల్లూరు, అన్నమయ్య, అనంతపురం జిల్లాలు నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశరాముడు, పోటీల నిర్వాహకుడు నాగరాజు, కోశాధికారి విజయ్‌కుమార్, టోర్నమెంట్ డైరెక్టర్ ఉదయ్ కిరణ్, న్యాయనిర్ణేతలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రేవు పరిశీలన

నందవరం న్యూస్‌టుడే : మండలంలోని నాగలదిన్నె గ్రామంలోని తుంగభద్ర నదిలో ఇసుక రీచ్‌ను ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సోమవారం పరిశీలించారు. డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరగడంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు తీసుకుని ఇసుకను తరలించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం నాగలదిన్నె వంతెనపై ఉన్న తెలంగాణ-ఆంధ్ర సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అక్రమ మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎమ్మిగనూరు గ్రామీణ సీఐ విక్రమ సింహా, ఎస్సై శ్రీనివాసులు నాగరాజు ఉన్నారు.


ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

మున్సిపల్ స్థలం కబ్జాకు యత్నం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు బండలు వేసి స్వాధీనం చేసుకునేందుకు యత్నించిడంతో మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. పట్టణంలో కర్నూలు జాతీయ రహదారిలోని ఎద్దుల మార్కెట్ ఎదురుగా ఉన్న రెండు సెంట్ల స్థలానికి చెందిన డాక్యుమెంటు తన వద్ద ఉన్నాయంటూ ఆదోనికి చెందిన ఓ పార్టీ నాయకుడు ఆ స్థలంలో బండలను నాటేందుకు సోమవారం యత్నించారు. సమాచారం అందుకున్న పురపాలక కమిషనర్ గంగిరెడ్డి, సిబ్బందిని స్థలం వద్దకు పంపించి అడ్డుకున్నారు. ఖాళీ స్థలాలను ఎవ్వరైన ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వీటి విలువ దాదాపు అరకోటికి పైగానే ఉంటుందని అధికారులు తెలిపారు.


జేసీకి సమస్యలు విన్నవించిన నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ఉచిత ఇసుక, గృహాలు మంజూరు చేయాలని ఎమ్మిగనూరు ప్రగతిశీల సంఘం యువజన సంఘం జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ కోరారు. సోమవారం కర్నూలులో జాయింట్ కలెక్టర్‌ని కలిసి ఎమ్మిగనూరు ప్రాంతంలోని సమస్యలను వివరించినట్లు ఆయన వెల్లడించారు.


వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సర్వేలో జరిగిన తప్పులను సవరించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : భూ సర్వేలో జరిగిన తప్పులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఆ తప్పులను సవరించాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సత్యన్న డిమాండు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. సత్యన్న మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో తప్పులు ఉండడంతో బ్యాంకు అప్పు తీసుకోవడానికి దరఖాస్తు చేస్తే ఆర్‌ఓఆర్, అడంగల్ రావడం లేదన్నారు. నాగేంద్ర, మల్లేష్‌బాబు, రవి, తేజ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కి వినతి పత్రం అందించిన సత్యన్న

అభివృద్ధికి దూరం.. సమస్యలతో సావాసం

ఏళ్లు గడిచినా ఇంకా మట్టిదారులే..

2011లో తూర్పు, పడమర బీసీల కాలనీలు ఏర్పడ్డాయి. 2014లో తెదేపా అధికారంలోకి వచ్చాక పడమర బీసీ కాలనీలోని ప్రజలకు ఇంటి స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించుకునేందుకు గృహ నిర్మాణ సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేసింది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కొన్ని వీధుల్లో మాత్రమే సీసీ దారులు నిర్మించి చేతులు దులిపేసుకుంది. కనీసం ఆ రహదారులలో కల్వర్టులను కూడా ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా మురుగు కాల్వలు లేకపోవడంతో నీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. ఇప్పటికి చాలా వీధులలో మట్టిదారులే కనిపిస్తున్నాయి. ఈ కాలనీలు కనీసం మౌలిక సదుపాయాలకు నోచుకోకపోవడంతో ఇక్కడ సొంత ఇళ్లు ఉన్నా గత్యంతరం లేక ఇతర కాలనీల్లో బాడుగ చెల్లించి నివాసం ఉంటున్నారు.


పడమర బీసీ కాలనీలో మట్టిదారి

తాగునీటికి అవస్థలే

ఈ కాలనీల్లో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో నీటి సమస్యను తీర్చాలని అధికారులు, ప్రజలకు కాలనీవాసులు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. పడమర బీసీ కాలనీలో అమృత్ పథకం ద్వారా నిర్మించే శుద్ధజల కేంద్రం నిర్మాణంలోనే ఉంది. పాత పంపుహౌస్ ఇక్కడే ఉన్న తాగునీటిని అరకొరగానే సరఫరా చేస్తుండటంతో, నీరు సరిపోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన విద్యుత్తు సదుపాయం కల్పించకపోవడంతో కాలనీలు అందకారంలో మగ్గుతున్నాయి.

గూడూరు గ్రామీణం న్యూస్‌టుడే : గూడూరు నగర పంచాయతీలోని పలు వార్డుల్లో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో ఆయా కాలనీవాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా 3, 4, 12 వార్డులు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయాయి. ఈ వార్డులలో దాదాపు 500 కుటుంబాలు జీవనం ఉంటున్నాయి. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు కనీస సౌకర్యాలైన సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి నోచుకోలేదు. గత ఐదేళ్ల పాలనలో శివారు కాలనీల్లో అభివృద్ధి కుంటు పడింది. దీంతో ఆయా కాలనీల్లో అపరిశుభ్రత నెలకొనడంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా సమస్యలు తీర్చాలని అధికారులు, నాయకులకు మొరపెట్టుకుంటున్న ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పట్టించుకునే వారేలేరు - షేక్షావలి, గూడూరు

బీసీ కాలనీలో మురుగు కాలువలు లేకపోవడంతో మురుగంతా ఇళ్ల ముందే నిలుస్తుంది. అదేవిధంగా చిన్నపాటి వర్షం కురిసిన మట్టిదారులన్ని బురదమయంగా తయారవుతున్నాయి. తాగునీటి పైపులైన్‌లు లీకేజీ కావడంతో ఆ నీరు రహదారులలో ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి.

చర్యలు చేపడతాం - కమిషనర్, నాగరాజు

ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతాము. నిధులను సమకూర్చుకొని సీసీ రహదారులు, కాలువల నిర్మాణాలను చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాను.

అవీ.. ఇవీ.. న్నీ..

గోనెగండ్ల న్యూస్‌టుడే : గాజులదిన్నె గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కురువ ధనంజయుడు కుటుంబానికి అండగా ఉంటామని 2013 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తెలిపారు. కుటుంబ సభ్యులకు రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు.

కౌతాళం న్యూస్‌టుడే : వ్యవసాయానికి పగటిపూటే విద్యుత్తును సరఫరా చేయాలని సోమవారం రైతులు కామవరం విద్యుత్తు ఉపకేంద్రం ముందు ఆందోళన చేపట్టారు. విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

గూడూరు గ్రామీణం న్యూస్‌టుడే: మండల పరిధిలోని కె.నాగలాపురం సుంకులమ్మ అమ్మవారిని కర్నూలు గ్రామీణ సీఐ చంద్రబాబునాయుడు సోమవారం దర్శించుకున్నారు. ఈవో నరసయ్య సీఐని సన్మానించారు. ఈయన వెంట ఏఎస్ఐ ఫజూల్‌ఖాన్ ఉన్నారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: కల్లుకుంట గ్రామంలో మలకలగడ్డ పొలాల రస్తాలో గుంతలు పడ్డాయి. మోకాలిలోతు గుంతల్లో ఎడ్లబండ్లు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : భూ సమస్యలు పరిష్కరించాలని రైతుల నుంచి నాలుగు వినతులు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

సి.బెళగల్ న్యూస్‌టుడే : మండల కేంద్రంలో సోమవారం తహసీల్దారు శ్రీనివాసు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిష్కార వేదికకు మొత్తం 8 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : సుంకేశుల జలాశయం నుంచి దిగువకు 33,618 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ ఇంజనీరు రాజు తెలిపారు. సోమవారం నాటికి జలాశయంలో 1.235 టీఎంసీ నిల్వ ఉండగా ఎగువ నుంచి 33,650 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : మాదిగ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకు భవిష్యత్తు కార్యచరణపై ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు మందకృష్ణను సోమవారం కలిసినట్లు ఎమ్మిగనూరు నియోజకవర్గం ఎంఆర్‌పీఎస్ నాయకులు ప్రతాప్ తెలిపారు.

ఆలయంలో సామగ్రి చోరీ

గూడూరు గ్రామీణం న్యూస్‌టుడే : మండల పరిధిలోని బూడిదపాడు శివారులోని శివాలయంలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. దుండగులు ఆలయం గంటలు, పూజ సామాగ్రిని దొంగలించారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్ఐ ఫజూల్‌ఖాన్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పురోహితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఏఎస్ఐ వెల్లడించారు. గత వైకాపా పాలనలో దేవాలయాలకు రక్షణ కరవైందని నియోజకవర్గ భాజపా యువ మోర్చా బాధ్యులు వంగూరు రాజు ఆరోపించారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బాణసంచా పేలి పత్తి దగ్ధం

మంత్రాలయం, న్యూస్‌టుడే : బాణాసంచా పేలి పత్తి దగ్ధం అయిన ఘటన సోమవారం మండలంలోని మాధవరంలో చోటు చేసుకుంది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో చిన్న యేసేబు ఇంటిపై పత్తిని ఆరబోశారు. కాలనీలో బాణాసంచా కాల్చడంతో నిప్పు రవ్వలు మిద్దెపై ఉన్న పత్తిపై పడటంతో మంటలు రేగాయి. మూడు క్వింటాళ్ల పత్తి కాలిపోయిందని బాధితుడు వాపోయారు.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం



బెలూన్లు ఎగురవేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఆధ్యాత్మిక భావాలు అవసరం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. చైల్డ్ ఇవాంజెలిజం ఫెలోషిప్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని కోల్స్ కళాశాల మైదానంలో చిల్డ్రన్స్ క్యాంప్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాలతో సన్మార్గంలో నడవవచ్చన్నారు. మూడు రోజులపాటు క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఎఫ్ నేషనల్ డైరెక్టర్ జయస్ పర్సిన్, కోల్స్ చర్చి అధ్యక్షుడు ఏడీవీ లింకన్, కోల్స్ కళాశాల ప్రిన్సిపల్ రూస్వెల్ట్ సియోనెస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త బస్సుల ప్రారంభం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: కర్నూలు ఒకటో డిపో గ్యారేజీలో రెండు సూపర్ లగ్జరీ, ఒక కొత్త అల్ట్రా డీలక్స్ బస్సును మంత్రి టీజీ భరత్ మంగళవారం ప్రారంభిస్తారని కర్నూలు ప్రజా రవాణాధికారి శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఒక సూపర్ లగ్జరీ బస్సు కర్నూలు-బెంగళూరు, మరో సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులను కర్నూలు-తిరుపతి మార్గంలో నడుపుతున్నట్లు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణ : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : **సమస్య:** ఆదిత్యనగర్, దేవనగర్, విఠలనగర్లలోని వీధుల్లో కాలువలు శుభ్రం చేయాలి. – స్థానికులు
సమస్య: సీతారాంనగర్, ఆదిత్యనగర్‌లో వీధి దీపాలు రాత్రి వేళల్లో సరిగా వెలగడం లేదు. – స్థానికులు
సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. – నగరపాలక సంస్థ అధికారులు

రైతు సంక్షేమానికి కృషి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. కల్లూరు పరిధి లక్ష్మీపురంలో సోమవారం రైతులకు రాయితీ పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె రైతులకు విత్తనాలను అందించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందని పేర్కొన్నారు. రైతు సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి, సహాయ వ్యవసాయ అధికారి సాలురెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

దారి చూపాలని నిరసన

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి కోసం భూములిచ్చిన నూతనపల్లె, పసుపల గ్రామాల రైతులు ప్రస్తుతం తమ పొలాల్లోకి వెళ్లేందుకు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారని నూతనపల్లె గ్రామ సర్పంచి బాలస్వామి వాపోయారు. నూతనపల్లె, పసుపల తదితర ప్రాంతాల రైతులు వారి పొలాల్లోకి వెళ్లేలా రస్తా సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద వద్ద ధర్నా చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. నాయకులు శేఖర్, వెంకట్, రాముడు, రమణ, శ్రీనివాసులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈసీకి సర్వర్ సమస్యలు



కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలోని కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) నకళ్ల సేవలు అందడం లేదు. గత వారం రోజులుగా ఈసీ జారీ కాకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థలం, పొలం, ఇల్లు ఇతరత్రా స్థిరాస్తులకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు ఈసీని ప్రామాణికంగా తీసుకుంటారు. గతంలో ఆస్తి ఎవరు.. ఎవరికి విక్రయించారు.. ప్రస్తుతం ఆ ఆస్తి ఎవరి పేరు మీద ఉంది.. ఇతరత్రా వివరాలు ఈసీలో స్పష్టంగా ఉంటాయి. ఈసీ తీసుకుని వివరాలు పరిశీలించిన తర్వాత ఆస్తుల కొనుగోళ్లు జరుగుతుంటాయి.

సాంకేతిక ఇబ్బందుల పేరుతో..

ఆస్తుల యజమానులు అప్పుడప్పుడూ ఈసీలు తీసుకుని తమ ఆస్తులను తనిఖీ చేసుకుంటూ ఉంటారు. అంతటి ప్రాధాన్యమున్న ఈసీ సేవలు స్తంభించిపోవడంతో జనం పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి రోజూ సుమారు 150 ఈసీలు జారీ చేస్తుంటారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.45 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. సాంకేతిక సమస్యలు తలెత్తటంతో ఈసీలు జారీ కావటం లేదు. రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సబ్ రిజిస్ట్రార్లను నియమించకపోవడంతో సమాధానం చెప్పేవారే కరవయ్యారు. ఉన్న ఇన్‌ఛార్జులు తమకేమీ తెలియదని.. సర్వర్ పనిచేయటం లేదని చెప్పి జనాన్ని వెనక్కి పంపేస్తున్నారు.

ఎవరికి ఫిర్యాదు చేయాలి..

జిల్లా రిజిస్ట్రార్ స్థానం సైతం ఖాళీగా ఉండటంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక జనం ఇబ్బందులు పడుతున్నారు. అసలు ఎప్పటినుంచి ఈసీ సేవలు అందుబాటులోకి వస్తాయో చెప్పేవారే కరవయ్యారు. ఈసీలు జారీ కాకపోవటంతో రిజిస్ట్రేషన్లపై ప్రభావం పడుతోంది. ఆస్తుల వివరాలపై స్పష్టత లేకపోవటంతో ఆస్తుల క్రయవిక్రయాలకు ఆటంకం ఏర్పడుతోంది.

మూడు పోస్టులు ఖాళీ

స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ప్రక్రియ ముగిసి దాదాపు 14 రోజులు దాటినా కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సబ్ రిజిస్ట్రార్లను నియమించలేదు. ఆయా కార్యాలయాలకు వచ్చేందుకు ఏ సబ్ రిజిస్ట్రార్ సుముఖత వ్యక్తం చేయటం లేదు. దీంతో ఈ రెండు పోస్టులను భర్తీ చేయటం ఉన్నతాధికారులకు కష్టంగా మారింది. సీనియర్ అసిస్టెంట్లు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్లుగా వ్యవహరిస్తున్నారు. నామమాత్రపు సేవలు అందిస్తుండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. జిల్లా రిజిస్ట్రార్‌తోపాటు రెండు సబ్ రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇకనైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

యోగాకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ



విజేతలకు బహుమతులు అందజేసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: దేశానికే పరిమితమైన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగర శివారులోని ఇండస్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు సోమవారంతో ముగిశాయి. అన్ని విభాగాల్లో రాణించి తుది పోరుకు చేరుకున్న క్రీడాకారులను అభినందించారు. జూనియర్ బాలికల విభాగంలో కె.పల్లవి (కర్నూలు) స్వర్ణం, భార్గవి (గుంటూరు) వెండి, పి.త్రివేణి (గుంటూరు) కాంస్య పతకాలు సాధించారు. వివిధ విభాగాల్లోనూ పలువురు పతకాలు సాధించారు. వీరిని మంత్రితోపాటు ఎస్పీ బిందుమాధవ్, ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు అభినందించి పతకాలు అందజేశారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు ఉపయోగించుకోండి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : దసరా నేపథ్యంలో స్వప్రాంతాలకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లాక్డ్‌హౌస్ మోనిటరింగ్ సిస్టమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జి.బిందుమాధవ్ సోమవారం సూచించారు. దొంగతనాలు అదుపు చేసేందుకు లాక్డ్‌హౌస్ మోనిటరింగ్ సిస్టమ్ సేవలను అందుబాటులో తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారాగానీ.. 91211 01075 నంబరుకు ఫోన్ చేసి సేవలు ఉపయోగించుకోవచ్చన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా నాగసుధ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా వి.నాగసుధ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో మేనేజర్ (ఫైనాన్స్)గా పనిచేస్తూ బదిలీపై కర్నూలు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న షర్మిల రిలీవై పౌరసరఫరాల సంస్థ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

అభివృద్ధి మరిచి.. అవస్థలు మిగిల్చి



నగర శివారులోని ఎల్కూరు బంగ్లా సమీపంలో రహదారులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఏళ్ల తరబడి మట్టి రోడ్లే ఉండటంతో కాలనీ వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షమొస్తే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని పేర్కొంటున్నారు. వెంటనే అధికారులు స్పందించాలని విన్నవిస్తున్నారు. **- న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం**

మురుగు కుంట.. రోగాలతో తంటా



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి వెనుక పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పెద్ద ఎత్తున మురుగు నీరు నిలిచి ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. **- ఈనాడు, కర్నూలు**

కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు. పార్టీ నగర అధ్యక్షుడిగా జిలానీ బాషా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్, డీసీసీ మాజీ అధ్యక్షుడు సుధాకర్ బాబు, మాజీ మంత్రి మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: దిల్లీలో 9వ తేదీ నుంచి జరిగే జాతీయస్థాయి మహిళా ఫుట్‌బాల్ పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని రేణుక ఏపీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరాశాంతి, వ్యాయామ అధ్యాపకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించి ఏపీకి ట్రోఫీ సాధించాలని కోరుతూ సోమవారం విద్యార్థినిని అభినందించారు. మరిన్ని పోటీల్లో విజయం సాధించాలని అధ్యాపకులు కోరారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు లయన్స్‌క్లబ్ అడ్మిన్ రత్నప్రసాద్ అన్నారు. నగరంలోని రోజా వీధిలో సుమలత అధ్యక్షతన సోమవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : గుట్టపాడు సమీపంలో జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారని.. గ్రామంలో రైతులు పూర్తిగా నష్టపోయినా ప్రభుత్వం, కర్మాగార యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు జగన్నాథం, మునెప్ప తదితరులు అన్నారు. వారు కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: సూపర్‌సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలుచేయాలని భారత ప్రగతి యువజన సంఘం నాయకులు కోరారు. ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ భారత ప్రగతి యువజన సంఘం నాయకులు చిన్నప్రసాద్, విజయ్, ఠాగూర్ తదితరులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: వీరశైవలింగాయత్‌లకు ఓబీసీ రిజర్వేషన్లు వర్తింపజేయాలని సురేష్‌బాబు తదితరులు కోరారు. ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. నాయకులు వీరేష్, రాజు, వెంకట్, రాము తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కౌతాళం మండలం మరళి-1 ఓపెన్ ఇసుక రీచ్‌కు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ డీడీ రవిచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ వరకు టెండరు బిడ్ ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: దుష్టశక్తిని వధించేందుకే అమ్మవారు ఆయుధం పట్టాల్సి వచ్చిందని జిల్లా మాతృశక్తి సంయోజిక జంపాల రాధిక, రాష్ట్ర మాతృశక్తి సంయోజిక గౌరి అన్నారు. ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవాలయంలో సోమవారం ఓర్వకల్లు ప్రఖండ ఆధ్వర్యంలో దుర్గావాహిని ఆయుధ పూజ కార్యక్రమాన్ని వారు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పసిపిల్లలు చనిపోతే రాజకీయ రంగు పులిమి తన స్వార్థ రాజకీయాలకు వాడుకోవాలని మాజీ సీఎం జగన్ చూశారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ ధ్వజమెత్తారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. చిన్నపిల్ల విషయంలోనూ శవ రాజకీయాలు చేసేందుకు చేపట్టిన పుంగనూరు పర్యటనను ఎందుకు రద్దు చేసుకున్నారని ప్రశ్నించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : పాత నగరంలో కుక్కల దాడిలో గాయపడిన వారికి మంత్రి పరిహారం ప్రకటించారని.. కౌన్సిల్, స్టాండింగ్ కమిటీలో చర్చించి పరిహారాన్ని చెల్లించి ఉంటే బాగుండేదని డిప్యూటీ మేయర్ రేణుక, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహారెడ్డి తదితరులు పేర్కొన్నారు. సోమవారం మాట్లాడుతూ బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి ఇప్పించేలా చూడాలని కోరారు.

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : గ్యాస్ సిలిండర్ రవాణా చేసే వాహనచోదకులు నిబంధనలు పాటించాలని కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆదేశించారు. స్థానిక స్టేషన్ ఆవరణలో అన్ని ఏజెన్సీల వాహనచోదకులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు.

ఉత్పత్తుల ఎగుమతితో అభివృద్ధి



ఉద్యోగికి బహుమతి అందజేస్తున్న ప్రధాన పర్యవేక్షకుడు జనార్దన్‌రెడ్డి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : జిల్లాలో తయారైన ఉత్పత్తులను విదేశాలకు సులువుగా పంపి వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని కర్నూలు డివిజన్ తపాలా శాఖ ప్రధాన పర్యవేక్షకుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. తపాలా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్పీడ్ పోస్ట్ సర్వీసులపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ సర్వీసుతో చిన్న, మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమలకు చెందిన నిర్వాహకులు తమ ఉత్పత్తులను విదేశాలకు పంపొచ్చని పేర్కొన్నారు. వినియోగదారులకు ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయక పర్యవేక్షకుడు నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

యువతకు శిక్షణ కార్యక్రమాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో సూక్ష్మ సేద్యం పథకం 15 వేల హెక్టార్లలో అమలుచేసేందుకు ఆదేశాలు వచ్చాయని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. జిల్లాలో డ్రిప్ పరికరాల నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దేందుకు ఫిట్టర్లు అవసరమవుతారని సోమవారం చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు సంప్రదించాలని కోరారు.

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.4,047

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వివిధ పంట ఉత్పత్తులు వచ్చాయి. 6,119 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.495, మధ్యస్థ ధర రూ.3,469, గరిష్ఠ ధర రూ.4,047 పలికింది. 1,292 క్వింటాళ్ల వేరుశనగకాయల దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.2,304, గరిష్ఠ ధర రూ.7,029కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

పంట సాగులో మెలకువలు తప్పనిసరి



పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: పంట సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కర్నూలు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సుజాతమ్మ పేర్కొన్నారు. ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా హుసేనాపురంలో పత్తి పంటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పత్తిలో వివిధ రకాల తెగుళ్లు, పురుగుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రవిప్రకాష్, చైతన్యకుమారి, రమాదేవి, శశిధర్‌రెడ్డి, ఏవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: సమగ్రశిక్షా ఉద్యోగులకు ఆగస్టు నుంచి సెప్టెంబరు వరకు రావాల్సిన వేతనాలు మంజూరు చేయించాలని ఏపీ ఐకాస నాయకులు నాగేశ్వరరావు, మహమ్మద్ రఫి, రాజు, మధుమోహన్ తదితరులు విన్నవించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతిపత్రం అందించారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బడ్జెట్ విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు.

మండలాల అభివృద్ధికి కృషి చేస్తాం



జడ్పీ సీఈవో నాసరరెడ్డిని సత్కరిస్తున్న ఎంపీడీవోల సంఘం ప్రతినిధులు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాను ప్రగతి పట్టాలపై నడిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని ఎంపీడీవోల సంఘం నాయకులు అన్నారు. వారు సోమవారం జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డిని జడ్పీలో సత్కరించారు. ఎంపీడీవోల బదిలీలపై ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడంతో సంతృప్తి వ్యక్తమవుతోందని చెప్పారు. మండలాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎంపీడీవోలు శ్రీనివాసులు, శివనాగప్రసాద్, మంజులవాణి తదితరులు అన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని నన్నూరుకు చెందిన జయరాముడు (35) విద్యుదాఘాతంతో మృతి చెందారు. గ్రామంలోని బంగ్లా కాలనీలో నివాసముంటున్న జయరాముడు తన ఇంటి వద్ద తాగునీటి మోటారు వేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కు గురై ప్రాణాలు వదిలారు. అతని భార్య ఇటీవలే మృతి చెందారు. భార్యభర్తలు మృతి చెందటంతో పిల్లలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి నాగన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చికిత్స పొందుతూ..

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని లొద్దిపల్లెకు చెందిన మద్దిలేటమ్మ (23) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై సునీల్‌కుమార్ తెలిపారు. మద్దిలేటమ్మకు గత కొంత కాలంగా మానసిక పరిస్థితి సరిగా లేదు. ఈ నేపథ్యంలో 3వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా గుర్తించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమెకు భర్త లింగన్న, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వినతులకు సత్వర పరిష్కారం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : వినతిపత్రాలు సత్వరం పరిశీలించి పరిష్కరించాలని ఆయా విభాగ అధికారులను నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టిడ్కో గృహ సముదాయం వద్ద వసతులు కల్పించాలని స్థానికులు కోరారు. కల్లూరు చెన్నమ్మ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ముజఫర్‌నగర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. నగరంలో పార్కులు అభివృద్ధి చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు విన్నవించారు.



గీతా మందిరంలో..



సూర్యనారాయణస్వామి ఆలయంలో..



హౌసింగ్‌బోర్డు కాలనీలో అలంకరణ



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నవదుర్గా.. నమోస్తుతే

నగరంలోని పలు ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని సోమవారం వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబస్తీలోని లలితాపీఠం, కాళికాంబ ఆలయం, గీతామందిరం, పెద్దఅమ్మవారు, చిన్న అమ్మవారిశాలలో విశేష పూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, కర్నూలు ఆధ్యాత్మికం, బీక్యాంపు

ధరల నియంత్రణలో విఫలం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ విమర్శించారు. కర్నూలు పాత నగరంలోని పూల బజార్, ఒకటో పట్టణం తదితర ప్రాంతాల్లో సీపీఎం పాతనగరం కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టగానే ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పి ప్రస్తుతం నిర్లక్ష్యం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, రామాంజనేయులు, నగేష్, షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పూల బజారులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బాలుడికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో నాలుగేళ్ల బాలుడికి మూత్రపిండాలకు సంబంధించి డా.అనంతరావు సోమవారం అరుదైన శస్త్రచికిత్స చేశారు. గత రెండు నెలలుగా కాళ్లు, ముఖం వాచిపోయి బాలుడు ఇబ్బందులు పడుతుండగా తల్లిదండ్రులు కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేశారు. మూత్రంలో ప్రొటీన్ లీకేజీ ఉందని పేర్కొన్నారు.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో పనిచేసే ఒప్పంద ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ శివయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలకాశి డిమాండ్ చేశారు. నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో విద్యుత్తు ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు సురేష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం సమావేశం ఏర్పాటుచేశారు.

సమస్యల తిష్ఠ.. పాలకులకేదీ శ్రద్ధ

■ పలు వార్డుల్లో సౌకర్యాలు కరవు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నగర పరిధిలోని సంతోష్ నగర్, గీతా ముఖర్జీ నగర్, విష్ణు టౌన్‌షిప్ తదితర ప్రాంతాల్లో పలు సమస్యలు నెలకొన్నాయి. చాలా వీధుల్లో వసతులు లేకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మట్టి రోడ్లే ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నడవలేని పరిస్థితి. రాత్రివేళల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో పలువురు అదుపు తప్పి పడిపోతున్నారు. ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నా నగరపాలక అధికారులు దృష్టి సారించడం లేదు.

రూ.కోట్లలో పన్నుల చెల్లింపు

హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి ప్రాంతానికి ఇరువైపులా 38, 39, 40 వార్డులు విస్తరించి ఉన్నాయి. 25 వేలకుపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలు ఏటా ఇంటి, ఆస్తి, నీటి పన్నుల రూపేణా నగరపాలక సంస్థకు రూ.20 కోట్ల వరకు చెల్లిస్తున్నారు. అయినా అవసరమైన సౌకర్యాలు కానరావడం లేదు. గీతాముఖర్జీ నగర్ తదితర ప్రాంతాల్లో కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. నగరపాలక అధికారులకు విన్నవించినా తీసుకున్న చర్యలు శూన్యమే. విష్ణు టౌన్‌షిప్‌లో సౌకర్యాలు లేకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు.



మట్టి రహదారే దిక్కు

ఈ రహదారి సంతోష్ నగర్‌లోని ఈద్గా నుంచి ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలకు వెళ్లే మార్గం. ఈ ప్రాంతంలో సుమారు పది బహుళ అంతస్తుల భవనాలు, 200 వరకు ఇళ్లు ఉన్నాయి. సీసీ రహదారి లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. అడుగడుగునా గుంతలు ఉన్నాయి. దీనికితోడు కాలువలు నిర్మించలేదు. ఫలితంగా ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలుస్తోంది. పాలకులు ఓట్ల కోసం వచ్చి పెద్దఎత్తున హామీలిచ్చారని.. ఆ తర్వాత కనీసం పట్టించుకోవడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేశారు.